# భారత శక్తి
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 297 | మంగళవారం,మే 19 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం..
### సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం

- కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం
- పదేళ్ల విరామం తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన యూడీఎఫ్ కూటమి
- రాజకీయ ప్రత్యర్థిగా భావించే రమేశ్ చెన్నితాలకు హోం శాఖ కేటాయించిన సీఎం
- తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమానికి రాహుల్ గాంధీ, ఖర్గే హాజరు




2లో..

## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం



**న్యూఢిల్లీ, (భారత శక్తి)**ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ప్రపంచ నాయకు లకు స్వీడన్ అందించే అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీ అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ పురస్కారం ఒక నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. అంతర్జాతీయంగా భారత భాగస్వామ్యాలను, ప్రపంచ దేశాలతో సహకారాన్ని బలోపేతం చేయడానికి మోదీ నిరంతరం చేస్తున్న కృషిని ఈ అవార్డు ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.

2లో..

## వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో
### ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి



**కరీంనగర్ (భారత శక్తి)** జిల్లా కలెక్టరేట్‌లో వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో

2లో..

## కేబీఆర్ పార్క్ చుట్టూ
# పనులకు బ్రేక్

- పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీంకోర్టులో విచారణ
- తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు
- కేబీఆర్ పార్కులో 1300 చెట్లను నరికేస్తున్నారని పిటిషన్



**హైదరాబాద్ భారత శక్తి,** హైదరాబాద్‌లోని ప్రముఖ కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఉన్న చెట్లను నరకవద్దని ఆదేశిస్తూ న్యాయస్థానం స్టే విధించింది. ముఖ్యంగా కేబీఆర్ పార్క్ సమీపంలో 35 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను ఎలాంటి పరిస్థితుల్లోనూ టచ్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం కింద పనులు ప్రారంభించింది. అయితే, ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి, పార్కులోని జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు సోమవారం నాడు స్టే ఇచ్చింది.సుప్రీంకోర్టు తాజాగా విధించిన స్టేతో కేబీఆర్ పార్క్ జంక్షన్ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఆర్‌డీపీ ఫ్లైఓవర్ పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను సుప్రీంకోర్టు జులై 27వ తేదీకి వాయిదా వేసింది.నగరం మధ్యలో ఉన్న కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల చెట్లను కొట్టివేస్తున్నారని సామాజికవేత్తలు, పర్యావరణ ప్రేమికులు కొన్ని రోజుల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతతో పర్యావరణానికి ప్రతికూల ప్రభావం ఉంటుందని, ఆక్సిజన్ కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో చెట్ల నరికివేతపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు విచారించిన

2లో..



## ప్రజల ప్రాణాల
# రక్షణే లక్ష్యం

- విపత్తులపై తెలంగాణ అప్రమత్తం
- అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు ప్రాణ,ం ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు కీలకం
- రాష్ట్రవ్యాప్తంగా వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలపై భారీ మాక్ ఎక్సర్‌సైజ్‌లు
- నెక్లెస్ రోడ్‌లో వరద మాక్ డ్రిల్‌ను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ మే 18, భారత శక్తి,** ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ వరద మాక్ డ్రిల్‌ను సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట అత్యంత కీలకమని, ఆ "గోల్డెన్ అవర్"లో తీసుకునే చర్యలే ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు, వరద ‌లు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. 1908లో హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి గోదావరికృష్ణా వరదలను ప్రస్తావించిన మంత్రి? విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే

2లో..

## ట్రంప్ ప్రకటనతో
## రూపాయి ఢమాల్



**న్యూఢిల్లీ,** భారత కరెన్సీ విలువ చరిత్రలో ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సోమవారం నాడు

2లో..

## సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా
# పనిచేయాలి


- ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపు



**హైదరాబాద్ మే 18, భారత శక్తి,** ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ, సమాజ ప్రగతికి యువ అధికారులు బాటలు వేయాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. సోమవారం లోక్ భవన్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంఆర్సి, హెచ్ఆర్డి)లో శిక్షణ పొందుతున్న 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అధికారులను అభినందించిన

2లో..

## సాగు నీటి ప్రాజెక్టులపై
# సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి (భారత శక్తి)** పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు సమీక్ష నిర్వ హించారు. నిర్వహించారు. ఇటీవల విడుదల చేసిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా నిర్దేశిత గడువుకు ప్రాజెక్టులు పూర్తి కావాలని సీఎం దిశానిర్దేశం చేసారు. వా ట ర్ మేనేజ్మెంట్ లో సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వా మ్యం కూడా తీసుకువచ్చేలా చర్యలు చేపట్టా లని ముఖ్య మంత్రి సూచించారు.

భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయిప్రసాద్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు హజరయ్యారు..

## మెట్రో రైళ్లకు
## కొత్త కోచ్‌లు



**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త. రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రయాణికులకు నిల్చోని ప్రయాణం చేసే బాధ తప్పనుంది. హాయిగా కూర్చోని ప్రయాణం చేయవచ్చు. ప్రభుత్వం కొత్త కోచ్‌ల కొనుగోలుపై కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం ఒప్పందం కుదుర్చుకోనుంది. హైదరాబాద్

2లో..

## తెలంగాణ రక్షణ సేన
## (టీఆర్ఎస్) జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

- నెల రోజుల పాటు టీఆర్ఎస్ జెండా పండుగ
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవి



**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు. మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు.ం

జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

2లో..

## కాన్వాయ్ తగ్గించుకున్న
## సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ (భారత శక్తి)** పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జల సంధి మూసివేత కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో చాలా దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు ఇప్పటికే ఇంధన ధరలు

2లో..

## రోడ్లపై నమాజ్‌లపై యోగి
## ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు



**ఉత్తరప్రదేశ్** రోడ్లపై నమాజ్ చేయడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. రోడ్లు అనేవి ప్రజల రాకపోకల కోసం ఉద్దేశించినవని, ప్రజా రవాణాకు అంతరాయం కలిగిస్తూ ట్రాఫిక్‌ను దిగ్బంధించే హక్కు ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. చట్టం, ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని, ఎవరికైనా సరే ప్రత్యేక మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.దకొందరు తనను

2లో..

## మోడీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం

విశేషమేమిటంటే, ఇది ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రస్థానంలో అందుకున్న 31వ అంతర్జాతీయ పురస్కారం అని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ఖ్యాతిని పెంచడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

## వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవసరమైన సూచనలు చేశారని తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరిగేలా మొత్తం అధికార యంత్రాంగం కృషి చేస్తోందని, అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 314 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇప్పటికే సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చినట్లు వెల్లడించారు.ఇప్పటివరకు జిల్లాలో 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, మిగిలిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి 63 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో బ్యాంకుల ద్వారా రూ.237.39 కోట్లు జమ చేసినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లా అధికార యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తోందని, రైస్ మిల్లర్లు, లారీ యజమానులు కూడా బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. ధాన్యం రవాణాకు అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం తీసుకుని కొనుగోలు కేంద్రాలకు వచ్చి రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు రాకూడదన్నారు. హమాలీల కొరత కారణంగా కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.పీఏసీఎస్ కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు, అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించి కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిచేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ పనులకు బ్రేక్

సుప్రీంకోర్టు తదుపరి విచారణ (జులై 27) వరకు చెట్లను టచ్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది.

### మాజీ సీఎం పేరు మీదుగా పార్కుకు పేరు..

కేబీఆర్ పార్క్ (కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ పార్క్) అనేది హైదరాబాద్‌లోని అత్యంత ప్రముఖమైన, విలాసవంతమైన ప్రాంతమైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ మధ్య విస్తరించి ఉన్న ఒక జాతీయ పార్కు. ఈ పార్కును 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి జ్ఞాపకార్థం ఆయన పేరు మీదుగా నామకరణం చేశారు. 1998లో కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ పార్కుగా ప్రకటించింది. కేబీఆర్ పార్కు ప్రాంగణంలోనే హైదరాబాద్ చివరి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిర్మించిన ప్రముఖ చిరాన్ ప్యాలెస్ కూడా ఉంది.నగర నడిబొడ్డున ఉన్నప్పటికీ ఈ పార్కులో వందలాది జాతుల పక్షులు, సీతాకోకచిలుకలు, నెమళ్లు, పాములు, చిన్న వన్యప్రాణులు (ముళ్లపందులు, అడవి పిల్లులు వంటివి) ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి ఇది ఒక పెద్ద ఆక్సిజన్ అందించే ప్రాంతం లాంటిది. ఇక్కడ చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్ నగరంలోని రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలకు మార్నింగ్, ఈవెనింగ్ వాక్‌ల కోసం మంచి వేదికగా నిలుస్తుంది.

## ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యం

ఎంతటి నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన బృందాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి? పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో మరింత సమర్థవంతమైన విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్ ను సందర్శించి రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు.తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని మంత్రి పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా అధికారులను అభినందించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఇవన్నీ పూర్తిగా ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా బాధ్యతాయుతమైన సమాచారమే ప్రజలకు చేరాలన్నారు.ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు.పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు

## కేరళలో యూడీఎఫ్ ప్రభుత్వం..

కేరళ : కేరళలో పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. నేడు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం చేశారు.

గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సతీశన్‌తో పాటు మరో 20 మంది ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రమేశ్ చెన్నితాల, కే. మురళీధరన్, ఏపీ అనిల్ కుమార్‌లకు స్థానం లభించింది.

అలాగే, కేపీసీసీ చీఫ్ సన్నీ జోసెఫ్ కూడా కేబినెట్‌లో చేరారు. మిత్రపక్షాల నుంచి ఐయూఎంఎల్ సీనియర్ నేత పీకే కున్హాలికుట్టి, ఆర్ఎస్పీ నేత షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నేత మోన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నేత అనూప్ జాకబ్ వంటి ప్రముఖులు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ వేడుకకు వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

### రాజకీయ ప్రత్యర్థికి హోం శాఖ.. సతీశన్ సంచలనం

కేరళ రాజకీయాల్లో ఓ అరుదైన పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి వీడీ సతీశన్, అత్యంత కీలకమైన హోం శాఖను తన వద్ద ఉంచుకోకుండా పార్టీలోని తన రాజకీయ ప్రత్యర్థిగా పేరున్న సీనియర్ నేత రమేశ్ చెన్నితాలకు కేటాయించారు. ఇది పార్టీలో అంతర్గత విభేదాలకు ముగింపు పలికి, సమన్వయంతో ముందుకు సాగాలనే సంకేతాలను ఇస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని చెన్నితాల ధ్రువీకరించారు. “పదేళ్ల తర్వాత యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన ఈ రోజు కేరళ ప్రజలకు శుభదినం. ప్రజలకు సుపరిపాలన అందించడం మా కర్తవ్యం. నేను హోం శాఖ బాధ్యతలు చేపట్టబోతున్నాను” అని ఆయన తెలిపారు.

### స్పష్టమైన ఆధిక్యంతో యూడీఎఫ్ విజయం

ఈ నెల 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో యూడీఎఫ్ కూటమి అద్భుత విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను యూడీఎఫ్ 106 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ పార్టీకి 63, దాని ప్రధాన మిత్రపక్షానికి 22 సీట్లు దక్కాయి. మరోవైపు, అధికారంలో ఉన్న వామపక్ష కూటమి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) కేవలం 35 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయం చవిచూసింది. సీపీఎం 26, సీపీఐ 8 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి. దేశంలో వామపక్షాలు అధికారంలో ఉన్న చివరి రాష్ట్రమైన కేరళలో కూడా అధికారం కోల్పోవడం గమనార్హం.

# సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేయాలి



ఆయన, పరిపాలనాంశాలపై దిశానిర్దేశం చేశారు.

### బాధ్యతాయుతంగా పనిచేయడమే అసలైన పరిపాలన

ప్రొబేషనరీ అధికారులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, పదవి అనేది కేవలం అధికారం మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం:

ప్రతి ప్రభుత్వ నిర్ణయంలోనూ సామాన్యుడి సంక్షేమమే ప్రధాన అజెండాగా ఉండాలి. నిజాయితీయే బలం: పరిపాలనలో పారదర్శకత, నిజాయితీ ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతాయి. సున్నితత్వం: కార్యాలయానికి వచ్చే ప్రతి పౌరుడి సమస్యను మానవీయ కోణంలో అర్థం చేసుకుని, తగిన పరిష్కారం చూపాలి.ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ శాంతి కుమారి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి పాల్గొన్నారు.

### సరస్వతీ అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరవ్వాలని దేవాదాయ శాఖ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించింది. మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ఈఏపీసెట్ టాపర్ మల్లాడి రుషికి అభినందనలు:

తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మల్లాడి రుషిని గవర్నర్ సోమవారం లోక్ భవన్‌లో ప్రత్యేకంగా అభినందించారు. రుషి సాధించిన విజయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె పట్టుదలతో పాటు, ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా గవర్నర్ ప్రశంసించారు.

### గవర్నర్‌ను కలిసిన గిగ్ కార్మికుల సంఘం:

తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ నేతృత్వంలో పలువురు ప్రతినిధులు సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

## ట్రంప్ ప్రకటనతో రూపాయి ఢమాల్

వారంలోని మొదటి ట్రేడింగ్ రోజున అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి కనిష్ట స్థాయికి పడిపోయింది. మే 18న భారత రూపాయి అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 96.17 వద్ద చారిత్రాత్మక కనిష్ట స్థాయికి పడిపోయింది.ట్రేడింగ్ సమయంలో కొంత సమయం పాటు ఒక డాలర్‌కు భారత రూపాయి 96.18 పడిపోయింది. ఇది మునుపటి క్లోజింగ్ ధర కంటే దాదాపు 0.2 శాతం కంటే తక్కువ. ఈ క్షీణతతో గత రికార్డు కనిష్ట స్థాయి ధర 96.1350ని కూడా నేటి ట్రేడింగ్‌లో దాటింది.భారత్ తన అవసరాలలో దాదాపు 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటుందని తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 111 డాలర్లకు చేరడంతో భారత దిగుమతి వ్యయం భారీగా పెరుగుతుంది. దాంతో భారత చమురు దిగుమతిదారులు చెల్లింపులు చేయడానికి మరిన్ని డాలర్లు అవసరం అవుతాయి. మార్కెట్‌లో డాలర్లను కొనుగోలు చేయడానికి డిమాండ్ పెరిగినప్పుడు, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే వేగంగా తగ్గడం ప్రారంభమవుతుంది.

### డొనాల్డ్ ట్రంప్ కొత్త హెచ్చరిక కారణం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్ సోషల్‌లో ఇలా పోస్ట్ చేశారు. 'ఇరాన్ కోసం అమెరికా ఎదురుచూస్తోంది. పరిస్థితి మరింత దిగజారకూడదంటే ఇరాన్ వేగంగా చర్యలు తీసుకోవాలి. చర్చల ద్వారా ఒప్పందం చేసుకుంటే వారికే మంచిది. లేకపోతే ప్రపంచ పటంలో వారి జాడ లేకుండా చేస్తాం. సమయం చాలా తక్కువగా ఉందని, ఇరాన్ త్వరగా మేల్కోవాలని' ట్రంప్ తాజాగా హెచ్చరించారు. ట్రంప్ తాజా వార్నింగ్ ప్రకటన కారణంగా ప్రపంచ పెట్టుబడిదారులు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. దాంతో భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్లు తమ డబ్బును వెనక్కి తీసుకుని సేఫ్ అని భావించే అమెరికన్ డాలర్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ కారణంగా భారత రూపాయిపై ఒత్తిడి మరింత పెరుగుతోంది. భారత కరెన్సీ రూపాయి బలహీనపడితే, విదేశాలలో విద్య నుంచి వైద్య చికిత్స వరకు ఎన్నో విషయాలు మరింత ఖరీదు అవుతాయి. టికెట్లు లేదా ట్యూషన్ ఫీజులు చెల్లించడానికి ఎక్కువ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తోంది.రూపాయి బలహీనపడితే, భారత్‌లోకి దిగుమతి చేసుకునే మొబైల్, ఆటోమొబైల్ భాగాలు, ల్యాప్‌టాప్‌లు, ల్యాప్‌టాప్ భాగాలు మరింత ఖరీదు అవుతాయి. డాలర్ మరింత ఖరీదు అయితే దేశంలో రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల నిత్యావసర వస్తువులతో పాటు పలు ఉత్పత్తుల ధర క్రమంగా పెరుగుతుంది.

## మెట్రో రైళ్లకు కొత్త కోచ్‌లు

మెట్రో ప్రయాణికులకు తీపికబురు అందింది. త్వరలో ప్రత్యేక కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం తిరుగుతున్న మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్లల్లోని కోచ్‌లు ప్రయాణికుల రద్దీ అవసరాలకు తగ్గట్లు లేవు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు నిల్చోని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉండటంతో కనీసం నిల్చోని ప్రయాణం చేయడానికి కూడా ఖాళీ ఉండటం లేదు. దీంతో తర్వాతి ట్రైన్ కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ప్రస్తుతం సమ్మర్ కావడంతో మెట్రోలో రద్దీ విపరీతంగా పెరిగింది. జనంతో మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి.ఈ క్రమంలో మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లు తీసుకురావాలని అధికారులు ఎప్పటినుంచో భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పుడు మరో ముందడుగు పడింది. ఇటీవల మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో కొత్త కోచ్‌ల ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దాదాపు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త కోచ్‌ల కోసం బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌తో చర్చలు జరుపుతోంది. ఆ సంస్థ కొత్త కోచ్‌లను సరఫరా చేయనుండగా.. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. త్వరలోనే అధికారికంగా ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని తెలుస్తోంది. 15 నెలల్లోనే కొత్త కోచ్‌లు సరఫరా తెలంగాణ ప్రభుత్వం ఆర్డర్ ఇస్తే.. 15 నెలల్లోనే కొత్త కోచ్‌లను బీఈఎంఎల్ సరఫరా చేయనుంది. ప్రస్తుతం నగరంలోని మూడు కారిడార్లలో 56 మెట్రో రైళ్లు సర్వీసులు అందిస్తున్నాయి. ఒక్కో రైలుకు 3 కోచ్‌లు మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇవి సరిపోవడం లేదు. దీంతో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ప్రయాణికులు నిల్చోని ప్రయాణం చేసే సమస్య కాస్త తగ్గుతుంది. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడమే కాకుండా ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం పెరుగుతుంది. దీని వల్ల మెట్రో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందనుంది.

## కాన్వాయ్ తగ్గించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి




భారీగా పెంచాయి. క్యూబాలో అయితే లాక్‌డౌన్ ప్రకటించారు. భారత నౌకలకు ఇరాన్ అనుమతి ఇవ్వడంతో తరచుగా నౌకలు వస్తున్నాయి. అయితే చమురు ధరలు పెరగడం, నిల్వలు తగ్గడంతో ప్రధాని మోదీ కూడా ఇంధన పొదుపు పాటించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఇంధన ధరలు పెంచారు. మోదీ పిలుపు మేరకు చాలా రాష్ట్రాల సీఎంలు తమ కాన్వాయ్ తగ్గించుకున్నారు. పొందుపు మంత్రం పాటిస్తున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయినా ప్రధాని పిలుపు, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్‌రెడ్డి కూడా తన అధికారిక కాన్వాయ్‌లో ముఖ్యమైన మార్పు చేశారు. ఇకపై నాలుగు వాహనాలతో మాత్రమే కాన్వాయ్ కదులుతుందని ప్రకటించారు. ఇంధన పొదుపు: ప్రధాని మోదీ పిలుపు నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, మంత్రులు తమ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే సందేశం స్పష్టంగా ఉంది. సీఎం రేవంత్ ఈ సందేశానికి ఆచరణాత్మక రూపం ఇచ్చారు. కాన్వాయ్‌లో అధిక వాహనాలు ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్, ప్రజల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యను గుర్తించి సీఎం సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించాలని నిర్ణయించారు.ముఖ్యమంత్రి స్వయంగా ఉదాహరణగా నిలవడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మీద ప్రభావం చూపవచ్చు. ఇది 'పైనుంచి కిందికి' మార్పు తీసుకురావడానికి సహాయపడుతుంది. ప్రభుత్వ ఖజానాకు అదనపు భారం తగ్గడం, ఇంధన ఖర్చు తగ్గడం దీర్ఘకాలికంగా మంచి ఫలితాలనిస్తుంది. చిన్న చిన్న మార్పులు కూడా పెద్ద మొత్తంలో పొదుపు తెస్తాయి. ట్రాఫిక్ మధ్యనే ప్రయాణించడం ద్వారా సాధారణ ప్రజల జీవన విధానాన్ని ముఖ్యమంత్రి అనుభవించే అవకాశం ఏర్పడుతుంది. ఇది రాజకీయ నాయకులు ? ప్రజల మధ్య దూరాన్ని కొంతవరకు తగ్గించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం అమలులో కొన్ని సవాళ్లు ఉండవచ్చు. ముఖ్యంగా భద్రతా పరమైన అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన కదలిక, ట్రాఫిక్ నిర్వహణలో పోలీసు బాధ్యతలునాయకత్వం నిజమైన పరీక్షకేవలం ప్రకటనలు కాకుండా వ్యక్తిగత స్థాయిలో మార్పు తీసుకురావడం రేవంత్ రెడ్డి నాయకత్వ శైలిలో భాగమని చెప్పవచ్చు. ఈ చిన్న అనుసరణ ఇతర రాష్ట్రాలు, అధికారులకు కూడా స్ఫూర్తినివ్వాలి. ఇంధన పొదుపు, ప్రజా సౌకర్యం, ప్రభుత్వ ఖర్చు తగ్గింపు వంటి అంశాల్లో ఈ నిర్ణయం సానుకూల ముద్ర వేస్తుందని ఆశించవచ్చు.

## రోడ్లపై నమాజ్‌లపై యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు

ఉత్తరప్రదేశ్‌లో రోడ్లపై నమాజ్‌ల నియంత్రణ గురించి అడుగుతుంటారని ప్రస్తావిస్తూ, యూపీలో అలాంటి వాటికి తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు. మసీదులలో స్థలం సరిపోని పక్షంలో, జనాభాకు తగ్గట్టుగా షిఫ్టుల పద్ధతిలో నమాజ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఇళ్లతో పాటు ప్రార్థనా స్థలాలలో స్థలాభావం ఉంటే, దానికి తగ్గట్టుగా నియంత్రించుకోవాలే తప్ప రోడ్లను ఆక్రమించడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను ఆయన తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో కూడా పంచుకున్నారు. ఈ అంశం కేవలం ఉత్తరప్రదేశ్‌కే పరిమితం కాకుండా... పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లోనూ వేడి పుట్టిస్తోంది. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇవే వ్యాఖ్యలను పునరావృతం చేశారు. అక్కడ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం రోడ్లపై నమాజ్‌లను అనుమతించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. అయితే, యోగి ఆరోపణలను టీఎంసీ వర్గాలు పూర్తిగా తోసిపుచ్చాయి. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే యోగి ఆదిత్యనాథ్ మైనారిటీలను బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగింది.

### రెండు తలల పాముల అక్రమంగా అమ్మకాలపై

## డీఆర్ఐ డెకాయ్ ఆపరేషన్



(భారత శక్తి) రెండు తలలపాముల విక్రయాలపై డీఆర్ఐ అధికారులు డెకాయ్ అపరేషన్ నిర్వహించారు. వరంగల్లో అక్రమంగా సజీవ రెండు తలల పాముల విక్రయానికి యత్నించిన వ్యక్తిని పట్టుకున్నారు. గ్రే మార్కెట్లో పాములు అమ్ముతున్నాడనే సమాచారంతో డీఆర్ఐ డీకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడి బ్యాగ్లో నుంచి రెండు ఇండియన్ రెడ్ సాండ్ బోవా (ఇతీఎలీ తీనీష్ట్రనితితి) పాములు స్వాధీనం చేసుకున్నారు. ఇండియన్ రెడ్ సాండ్ బోవా పాములకు మార్కెట్ లో గిరాకీ ఎక్కువ వుంటుంది. క్షుద్ర పూజలు, అదృష్టం కోసం, కొన్ని రకాల ఆయుర్వేద మందుల తయారీ కోసం వీటిని విపరీతంగా కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో దీని ధర రూ. 2 కోట్ల నుండి రూ. 25 కోట్ల ఉంటుందని అంచనా. స్వాధీనం చేసుకున్న పాములు, ప్యాకింగ్ సామగ్రి, నిందితుడిని వరంగల్ ఫారెస్ట్ రేంజ్ అధికారులకు అప్పగించారు.

## రౌడీ షీటర్ల కవాతు

**వరంగల్ (భారత శక్తి)**వరంగల్ పోలీసులు రౌడీషీటర్లతో రోడ్డుపై కవాతు నిర్వహించారు. సబ్ డివిజన్ లోని అజాం జాహి మిల్స్ కాలనీ ఠాణా నుంచి ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం శివనగర్ వరకు నడిపించారు. సీఐ రమేష్, ఎస్సైలు మండుటెండలో రౌడీషీటర్లను నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఎదుట రౌడీషీటర్ల బైండోవర్ చేసారు. ముందు పోలీసులు, వెనుక జీపులు.. మధ్యలో రౌడీషీటర్ల మార్చ్ కొనసాగింది.

## శ్రీకాళహస్తి ఆలయంలో హోం మంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘన స్వాగతం






**శ్రీకాళహస్తి (భారత శక్తి).** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన హోం మంత్రి వంగలపూడి అనిత కి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రాంగణంలో ఘనంగా స్వాగతం పలికారు.?అనంతరం మంత్రి కి ఆలయంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, ఎమ్మెల్యే స్వయంగా దగ్గరుండి శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దివ్య దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం హోం మంత్రి కి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆ పరమశివుని కృపాకటాక్షాలతో రాష్ట్రం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ , రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , అధికారులు మరియు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ వేటగాళ్ల గుట్టురట్టు!

**- మల్కాజ్‌గిరి పోలీసుల మెరుపు దాడి: ఐదు ముఠాల ఆటకట్టు, ఆరుగురు నిందితుల అరెస్ట్.**

**- దేశవ్యాప్తంగా విస్తరించిన మాయగాళ్ల నెట్‌వర్క్.. బాధితులకు రూ. 6.80 లక్షల నగదు రికవరీ.**




**మల్కాజ్‌గిరి, మే 18: భారత శక్తి.** నిరుద్యోగుల ఆశలను, మదుపరుల అత్యాశలను ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌పై మల్కాజ్‌గిరి కమీషనరేట్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. గతవారంలో (మే 10 నుండి మే 16 వరకు) జరిపిన మెరుపు దాడుల్లో ఐదు కీలకమైన సైబర్ మోసాల గుట్టురట్టు చేశారు. ఈ కేసుల్లో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దేశవ్యాప్తంగా విస్తరించిన ఈ మాయగాళ్ల బారిన పడి మోసపోయిన బాధితులకు న్యాయస్థానం ద్వారా రూ. 6.80 లక్షల నగదును తిరిగి ఇప్పించినట్లు పోలీసులు వెల్లడించారు.

### కమిషన్ల కక్కుర్తి.. ఖాతాల విక్రయం!

పోలీసులు ఛేదించిన కేసుల వివరాల ప్రకారం.. అరెస్టయిన నిందితులంతా సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంక్ ఖాతాలను అద్దెకు ఇస్తూ (మ్యూల్ అకౌంట్ హోల్డర్స్), కమీషన్లు దండుకుంటున్న స్థానిక ఏజెంట్లుగా తేలింది. వీరు అమాయకుల సొమ్మును నేరగాళ్ల ఖాతాల్లోకి మళ్లించడానికి ప్రధాన వంతెనలా వ్యవహరిస్తున్నారు.

### ఐదు విభిన్న మోసాలు.. ఇలా దోచేశారు!

#### 1.జర్మనీలో ఉద్యోగాలంటూ భారీ మోసం

సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన కాసాని సతీష్ అనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. 'నెక్స్ట్ పాత్ ఓవర్సీస్ కన్సల్టెంట్స్' సంస్థ ప్రతినిధిగా, 'దిల్‌కుష్' అనే నకిలీ గుర్తింపుతో నిరుద్యోగులకు జర్మనీలో వీసాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించారు. ఎనిమిది మంది అభ్యర్థుల నుంచి పాస్‌పోర్టులు, ధృవీకరణ పత్రాలు సేకరించి నకిలీ నియామక పత్రాలు (ఆఫర్ లెటర్లు) సృష్టించారు. భద్రతా డిపాజిట్ పేరిట బాధితుడి నుండి రూ. 5,39,999/- వసూలు చేసి ఆ తర్వాత ఫోన్లు బంద్ చేశారు. ఈ కేసులో నిందితుడు సతీష్ సైబర్ నేరగాళ్లకు తన ఖాతాను అందించినట్లు తేలింది.

#### 2.'మిలిటరీ అధికారి' పేరిట ? నాటకం

పెద్దపల్లి జిల్లా మంథని మండలానికి చెందిన ఇందారపు నవీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అంతర్జాల వేదిక (ఆన్‌లైన్ పోర్టల్)లో ఇల్లు అద్దెకు ఉందంటూ ప్రకటన ఇచ్చిన ఓ మహిళను సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. తాను ఆర్మీ 'కెప్టెన్ పవార్' అని పరిచయం చేసుకుని, సైనిక నిబంధనల ప్రకారం ముందస్తు చెల్లింపులు చేయాలంటూ నమ్మించారు. ఖాతా ధృవీకరణ ప్రక్రియలో భాగంగా నగదు తిరిగి వస్తుందంటూ నమ్మించి బాధితురాలి నుంచి ఐదు విడతల్లో రూ. 2,75,545/- కాజేశారు. నవీన్ ఈ కేసులో ఖాతాల సేకరణదారుడిగా వ్యవహరించాడు.

#### 3.వాట్సాప్ సమూహం.. రూ. 21.50 లక్షలు గోవిందా!

హైదరాబాద్‌కు చెందిన కొమ్ము విష్ణు (కొత్తపేట), మక్కల అరవింద్ (కుత్బుల్లాపూర్)లను పోలీసులు జైలుకు పంపారు. బాధితుడి ప్రమేయం లేకుండానే ఒక నకిలీ వాట్సాప్ సమూహం (VIP గ్రూప్)లో యాడ్ చేశారు. తాము స్టాక్ మార్కెట్ నిపుణులమంటూ నమ్మించి, నకిలీ వాణిజ్య వేదిక (ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్) ద్వారా ప్రాథమిక వాటా అమ్మకాల (IPO) పేరిట రూ. 21.50 లక్షలు పెట్టుబడి పెట్టించారు. తీరా లాభాలు వచ్చాక విత్‌డ్రా చేసుకోబోతే.. దళారీ రుసుము (బ్రోకరేజ్ ఛార్జీల) పేరిట మరో రూ. 5 లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

#### 4.కస్టమ్స్ అధికారులమంటూ బెదిరింపులు




వనస్థలిపురం బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పందుల శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారు. ఢిల్లీ సుంకముల శాఖ (కస్టమ్స్) అధికారి నేహా శర్మ మాట్లాడుతున్నానంటూ బాధితుడికి ఫోన్ చేసి, బ్రిటన్ నుండి మీ పేరు మీద బంగారు గొలుసులు, విదేశీ కరెన్సీ ఉన్న పార్సిల్ వచ్చిందని బెదిరించారు. ఆపై రిజర్వ్ బ్యాంక్ (RBI) పేరిట నకిలీ ఈమెయిళ్లు పంపి.. కరెన్సీ మార్పిడి, సుంకము, ఆదాయపు పన్ను పేరిట రూ. 4,79,000/- గుంజారు.

#### 5.ఎండీ ఫోన్ హ్యాక్.. ఒకేసారి రూ. 40 లక్షలు స్వాహా!

విజయపురి కాలనీ (వనస్థలిపురం)కి చెందిన నన్నాక రఘునాథ్‌ను సైబర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక ప్రైవేట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఫోన్‌కు సైబర్ కేటుగాళ్లు ఎవరికీ తెలియకుండా ఒక ప్రమాదకరమైన లింక్ ద్వారా హ్యాకింగ్ ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. అనంతరం ఆయన వాట్సాప్ అకౌంట్ ద్వారా అకౌంటెంట్‌కు మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా నగదు బదిలీ చేయాలంటూ ఆదేశించారు. స్వయంగా డైరెక్టరే పంపించారనుకుని బాధితుడు రెండు రోజుల్లో ఏకంగా రూ. 40,08,000/- బదిలీ చేసి మోసపోయాడు.

#### జాగ్రత్త: నెటిజన్లూ.. ఇవి అస్సలు నమ్మకండి!

నేరుగా ఇంటర్వ్యూలు లేకుండా వచ్చే పార్ట్-టైమ్ ఉద్యోగ ప్రకటనలను నమ్మొద్దు.
అసాధారణ లాభాలు, గ్యారెంటీ రిటర్న్స్ ఇచ్చే కొత్త వెబ్‌సైట్లలో పెట్టుబడులు పెట్టకండి.
వాట్సాప్, ఎస్ఎంఎస్, ఈమెయిళ్లలో వచ్చే గుర్తుతెలియని లింకులను అస్సలు క్లిక్ చేయవద్దు.
ఆన్‌లైన్ వ్యక్తులు పంపే లింకుల ద్వారా ఎలాంటి ట్రేడింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దు.
డిజిటల్ అరెస్ట్ లేదా పార్సిల్ బెదిరింపులకు అస్సలు భయపడకండి.
**ముఖ్య గమనిక:** పొరపాటున సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930', హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrimes.gov.in, వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO) సూచించారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి

**-సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ వెంటనే గద్దె దిగాలి.. -వైఎస్ఆర్ సిపి ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ వద్ద వినూత్న నిరసన**



**రాజమహేంద్రవరం (భారత శక్తి):** కూటమి ప్రభుత్వ పాలనలో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఎపిలోనే అత్యధికంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్నాయని, ఇది ప్రభుత్వ పాలకుల అసమర్ధతకు నిదర్శనంగా ఉందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్, రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర రావు సారధ్యంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టరేట్ వద్ద వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసారు. ఆటోలకు తాళ్లు కట్టి లాగుతూ గోదావరి రైల్వే స్టేషన్ నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకుని అక్కడ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఇచ్చిన హామీని విస్మరించిన సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేసారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు దారుణంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. పక్కనున్న తమిళనాడు కంటే 5 నుంచి 6 రూపాయలు ధరలు ఎక్కువగా ఉంటే సిఎం చంద్రబాబు ధరలు తగ్గించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎన్డీఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు పార్టీ ఇచ్చిన మద్ధతుతోనే కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించకలేకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మాత్రం హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వెళ్లడానికి ప్రత్యేక విమానాలు వాడుతూ ప్రజలు ఇంధన పొదుపు చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలన అంటేనే మాయ, అబద్ధాలు అని ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా ప్రజల్ని మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. పెంచిన ధరలు తగ్గించే వరకు వైసిపి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేసారు. ఎపి హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలన ఎప్పుడు వచ్చినా బాదుడే బాదుడులా ఉంటుందని విమర్శించారు. ఈ ధరలు తగ్గించకపోతే సామాన్యుడి జీవితం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా ప్రజలపై ధరల భారం పెంచడం సరికాదన్నారు.

వాసంశెట్టి గంగాధర రావు మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా రవాణా రంగం పూర్తి కుదేలవుతుందని, నిత్యావసరాల ధరలు దారుణంగా పెరిగిపోతాయన్నారు. సామాన్యులు ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనలో ఇబ్బందులు పడుతుంటే మళ్లీ వారిపై పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని వేయడం సమంజసం కాదన్నారు. ఇంధనం పొదుపు చేయాలని నీతులు చెబుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లోకేష్ ముందు వారు పాటించాలని డిమాండ్ చేసారు. ధరలు పెరగకుండా చేస్తామని అధికారంలోకి వచ్చి పాలనలో విఫలమైన కూటమి ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుర్రం గౌతమ, జిల్లా మహిళాధ్యక్షురాలు మార్తి లక్ష్మి, వివిధ విభాగాల నాయకులు మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, సప్పా ఆదినారాయణ, బిల్డర్ చిన్న, కాటం రజనీకాంత్, రొక్కం త్రినాధ్, మార్తి నాగేశ్వరరావు, హసీనా, షేక్ నిజామ్, బూడిద శరత్‌కుమార్, అమీర్ పాషా, సుందర్ సింగ్, నల్లా రామాంజనేయులు, రేగుళ్ల నాని, అనంతలక్ష్మి, కృష్ణవేణి, మార్గాని రాము, ఆరే చిన్ని, ఎస్.కె షరీఫ్, ఆరిఫుల్లా ఖాన్, కాటం సంజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందచేసారు

# సంపాదకీయం

భారత శక్తి VOICE OF INDIAN

## ఒకప్పుడు అప్రతిహతం..

# నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం.1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్-అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి.ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టి ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చండ్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విభేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చండ్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి.

జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమిలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి. కమ్యూనిస్టు పార్టీలకు అనేక ఆంక్షలు ఉన్నా శ్రామికుల సమ్మెలు, రైతాంగ ఉద్యమాలలో పార్టీ గ్రూపులు పనిచేస్తూనే వస్తున్నాయి.

## మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న మూడు పంటల బియ్యాన్ని ఎఫ్‌సీఐ ఎందుకు సేకరించలేదో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**-ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు**



జగిత్యాల, మే 18 (భారత శక్తి ప్రతినిధి): ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, రైతుల ఖాతాల్లో డబ్బుల జమ పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు పంటల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లర్ల వద్ద నిల్వ ఉంచిందని తెలిపారు. అయితే ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను నిర్వర్తించకపోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లుల్లో భారీగా నిల్వలు పేరుకుపోయాయని చెప్పారు.రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరణ జరిగేలా చూడాల్సిందిపోయి, రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఇటీవల ప్రధాని హైదరాబాద్ పర్యటన సందర్భంగా కూడా రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించలేదని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని బాధ్యతగా కొనుగోలు చేస్తుండగా, బీజేపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, రైతులు పండించిన చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.కొనుగోలు పూర్తయిన తర్వాత మిల్లర్ల వద్ద తలెత్తే సమస్యలకు రైతులను బాధ్యులను చేయవద్దని అధికారులకు సూచించారు. ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ-బీ గ్రేడ్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని మిల్లర్లకు మంత్రి సూచించారు.

# సిరిసిల్లలో తీవ్ర ఉద్రిక్తత...

## నేతన్న చౌరస్తా వద్ద రణరంగంగా మారిన బీజేపీ-బీఆర్ఎస్ ధర్నా.



భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, మే 18 : జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఒక్కసారిగా రాజకీయ సెగలు రేగాయి. పట్టణంలోని నేతన్న చౌరస్తా వేదికగా ప్రతిపక్ష పార్టీల మధ్య చెలరేగిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా చేపట్టిన ధర్నా కార్యక్రమం కాస్తా, పరస్పర దాడులు, ఘర్షణలతో రణరంగంగా మారింది. బండి సంజయ్ ని బర్తరఫ్ చేయాలని బిఆర్ఎస్ శ్రేణులు, కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనాతో 29 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ శ్రేణులు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఇరు పార్టీలు పిలుపునివ్వడంతో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు నేతన్న చౌరస్తాకు చేరుకున్నారు. ఒకరినొకరు.. 'బండి సంజయ్ డౌన్ డౌన్' అంటూ బీఆర్ఎస్ శ్రేణులు, 'కేటీఆర్ డౌన్ డౌన్' అంటూ బీజేపీ కార్యకర్తలు భారీ ఎత్తున నినాదాలు చేశారు.

ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి, తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. చూస్తుండగానే ఇరు పార్టీల శ్రేణులు పరస్పరం చెప్పులతో దాడులకు దిగారు. నెట్టుకోవడాలు, చెప్పుల దాడిలతో చౌరస్తా ప్రాంతం అంతా గందరగోళంగా మారింది. కార్యకర్తలు కొట్టుకునే స్థాయికి చేరడంతో స్థానికులు, పాదచారులు భయాందోళనకు గురయ్యారు. ?పరిస్థితి చేతులు దాటిపోతుండటంతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వయంగా రంగంలోకి దిగారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించి పరిస్థితిని సమీక్షించారు. ఎంత సర్దిచెప్పినా వినకుండా, పోలీసులకు ముప్పుతిప్పలు పెడుతున్న ఉభయ పార్టీల నేతలను, కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. లాఠీలకు పనిచెప్పిన పోలీసులు ఘర్షణ పడుతున్న ఇరువర్గాలను చెల్లాచెదురు చేశారు. నిరసనకారులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ?ఈ హఠాత్పరిణామంతో సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ పూర్తిగా అంతరాయం కలగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నేతన్న చౌరస్తా వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ ఘటనతో సిరిసిల్ల పట్టణంలో ప్రస్తుతం ప్రశాంతత ఉన్నప్పటికీ, అంతర్గతంగా తీవ్ర రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది.

## దివ్యాంగులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**- టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 18: ఆత్మస్థైర్యం తో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ఎంతో మంది దివ్యాంగులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని టిజిఐ ఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు.సంగారెడ్డి పట్టణంలోని సంజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు వినికిడి పరికరాలను , వీల్ చైర్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నిర్మలా జగ్గారెడ్డి సూచించారు.ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు సంగీతా మహేష్, యశోద , విద్యాశాఖ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## కౌండిన్య కాలనీలో సోమవారం వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణ



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే18: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విపత్తు నిర్వహణ--2026 కార్యక్రమంలో వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కౌండిన్య కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని వివిధ డెమోలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, స్పందన వ్యవస్థలు, సహాయక చర్యలను సమీక్షించి మరింత మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో లోపాలను గుర్తించి స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.జిల్లాలోని 7 మండలాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. కామారెడ్డి మండలంలోని కౌండిల్య కాలనీ, బిక్నూర్ మండలంలోని రామేశ్వరపల్లి, రాజంపేట మండలంలోని గుండారం, బీబీపేట్ మండలంలోని పెద్ద చెరువు, మద్నూర్ మండలంలోని బొగ్గుగుడిసె, ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలంలోని మేజర్‌వాడ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు, శాఖల సమన్వయం తదితర అంశాలపై అధికారులు ప్రత్యక్ష సాధన నిర్వహించారు. వరదల్లో కొట్టుకుపోయిన బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ (సిపిఆర్) ద్వారా ఎలా ప్రాథమిక చికిత్స అందించాలో, అలాగే వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. సహాయక బృందాలు ప్రాణాపాయ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ పరికరాల వినియోగం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు.అనంతరం మాక్ డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది, సంబంధిత అధికారులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి, బీబీపేట్ పర్యవేక్షకులుగా లేబర్ శాఖ అధికారి శశికుమార్, పోలీస్ బెటాలియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏసిఎల్ బి ఇన్‌చార్జ్ ఎన్‌వీ గిరి, డిఎఫ్ఓ సుధాకర్, డిసిఎమ్ఎచ్ఓ విజయభాస్కర్, పీడీ మెప్మా శ్రీధర్, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, యువత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని జూమ్ మీటింగ్ ద్వారా హైదరాబాద్‌లోని విపత్తు నిర్వహణ అధికారులు మానిటరింగ్ చేశారు.

## నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్నా పోలీసులు.

**-386 కిలోల ప్రభుత్వ నిషేధిత**

**బి టి 3 పత్తి విత్తనాల పట్టివేత : డీసీపీ భాస్కర్**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 18 ( భారత శక్తి ) : బీమారం ,చెన్నూరు మండల కేంద్రములో నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్నట్లు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తెలిపారు.మాట్లాడుతూ రెండు కేసుల్లో అయిదు గురు సభ్యులు ముఠాగా ఏర్పడి ఆంధ్రా ప్రాంతం నుండి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ముగ్గురిని అదుపులోకి తీసుకొని మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు.నకిలీ పత్తి విత్తనాల వల్ల భూమి సారవంతం కోల్పోయి పంటలు నష్టం వాటిల్లే ప్రమాదముందని, పర్యావరణం పై ప్రభావం చూపెడుతుందని అందువల్ల నకిలీ విత్తనాలు వాడవద్దని ఆయన రైతులకు సూచించారు.అలాగే గతంలో కూడా నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలసి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని రైతులు ఎవరూ మోసపోవద్దని ఆయన తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం,పోలీసులు నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరిస్తామని పీడీ యాక్ట్ కేసులు కుడా నమోదు చేస్తామని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.అంతేకాక రెండు కేసుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసులను డీసీపీ అభినందించి వారికి రివార్డులు కూడా అందిస్తామని పేర్కొన్నారు.

## కిషోర్ బాలికల ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి



జగిత్యాల, మే 18 (భారత శక్తి ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా ధర్మపురి మున్సిపల్ పరిధిలోని నక్కలపేట ఇందిరమ్మ కాలనీ బస్తీ దవాఖానలో సోమవారం "కిషోర్ బాలికల" ఆరోగ్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రారంభించారు.మే 18 నుంచి 23 వరకు నిర్వహించే ఈ శిబిరంలో 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత, మధుమేహం, బి ఎం ఐ పరీక్షలతో పాటు మెన్స్ట్రువల్ హైజిన్‌పై ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ, బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సరైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విరవేణి నాగలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు శివకుమారి, వెంకటేష్, ఉమామహేశ్వరి, ఆశా వర్కర్లు, సూపర్వైజర్లు, మహిళా గ్రూప్ ఆర్పీలు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లలో జాప్యంపై బీఆర్ఎస్ నేతల ఆందోళన



జగిత్యాల, మే 18 (భారతశక్తి ప్రతినిధి): ధర్మపురి మార్కెట్ యార్డ్‌లో నెల రోజులుగా వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మార్కెట్ యార్డ్‌ను పరిశీలించిన మండల కన్వీనర్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అయ్యోరి రాజేష్ కుమార్ డిప్యూటీ తహసీల్దార్ తిరుపతికి రైతుల సమస్యలను వివరించారు.ఒక బస్తాకు అధికంగా తరుగు వేస్తూ, క్వింటాలుకు సుమారు 5 కిలోల వరకు కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఎండలో రైతులు ఇబ్బంది పడుతున్నప్పటికీ, జోకిన బస్తాలను కూడా వెంటనే తరలించడం లేదన్నారు. బస్తాలకు కట్టే దారాలు, సీరియల్ నంబర్ ఇంక్ బాటిళ్లు కూడా రైతులే కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు.రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, వోడ్నాల మల్లేశం, చిలువేరి శ్యామ్ సుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నెని నర్సయ్య, చుక్క రవి, బండారి అశోక్, తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, గడ్డం మహిపాల్ రెడ్డి, ఎస్డి అసిఫ్, ఎండీ శమీమా, ఆనందాసు శ్రీనివాస్, కాశెట్టి విజయ్, మూటపెల్లి లడ్డు, కళ్లెం రిషి రెడ్డి, గొల్ల మల్లేష్, మొలుగూరి ప్రశాంత్, భోగ రమేష్, అబ్దుల్ జావీద్, నూనె సాయి, అంబటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.విద్యుత్, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

**-సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 18(భారత శక్తి) బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పండుగ నేపథ్యంలో పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈద్గాల పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. అలాగే ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.**

జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగను



ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల

## ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి



జగిత్యాల, మే 18( భారత శక్తి ప్రతినిధి ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి త్వరగా పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 81 ఫిర్యాదులు అందగా, వాటిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం తెలంగాణ టూరిజం టూరిస్ట్ గైడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధం కఠినంగా అమలు చేయాలి


**నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 18(భారత శక్తి) గోవధ నిషేధానికి నిర్మల్ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, దాని కొరకు 24/7 జిల్లా వ్యాప్తంగా 14 చెక్ పోస్టులను నడపడం జరుగుతుందని తెలియ జేశారు.సోషల్ మీడియాలో నిర్ధారణ లేకుండా అసత్య ప్రచారాలు చేయడం, ప్రజల్లో అపోహలు సృష్టించడం చట్ట విరుద్ధమని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ తెలిపారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఎద్దులను , గోవులు అని తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నారు. దీని వలన చాలా అలజడి నెలకొంటుంది. ఇలాంటి అసత్య ప్రచారాల వల్ల సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా గోవుల అక్రమ రవాణా జరుగుతోందని అనుమానం కలిగితే లేదా ఆవులు తరలిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 కు సమాచారం అందించాలని, పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలియ జేశారు.గోవులను సంరక్షించే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు అని, అదే సమయంలో అసత్య ప్రచారాలు చేసే సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు.

## డ్వాక్రా మహిళల ఆరోగ్య రక్షణ కోసమే “హెల్త్ మిషన్-100


**- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, మే 18 : తెలంగాణలోని డ్వాక్రా (స్వయం సహాయక సంఘాల) మహిళల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం “హెల్త్ మిషన్-100” (100 రోజుల ఆరోగ్య మిషన్) అనే బృహత్తర కార్యక్రమం ద్వారా ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తుందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా గ్రామణాభివృద్ధి శాఖ, కంది మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లో కంది గ్రామ పిహెచ్సి లో ఏర్పాటు చేసిన వైద్య పరీక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో సాధారణంగా వచ్చే బిపి, సుగర్, థైరాయిడ్, రక్త హీనత వంటి 30 రకాల పరీక్షలను ఉచితంగానిర్వహిస్తున్నారన్నారు.పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రతీ మహిళ కు క్యుఆర్ కోడ్ తో కూడిన “డిజిటల్ హెల్త్ కార్డ్” రూపొందించి ప్రభుత్వ పోర్టల్ లో భద్రపరుస్తారని వివరించారు. దీనివల్ల భవిష్యత్తు లో ఏ ఆసుపత్రికి వెళ్ళిన వారి పూర్తి ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలకు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు.ఈ కార్యక్రమం లో కంది గ్రామ సర్పంచ్ శ్రీరామ్, ఉప సర్పంచ్ ఖాన్, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

**- 56 వ డివిజన్ కార్పొరేటర్ నల్ల శంకర్**



మంచిర్యాల, జిల్లా ప్రతినిధి, మే 18( భారత శక్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పంపిణీలో బాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో 56 వ డివిజన్ లోని సుంకే హేమలత కు డివిజన్ కార్పొరేటర్ నల్ల శంకర్ ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్ పేపర్ ను సోమవారం రోజున అందజేశారు.ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ నల్ల శంకర్ మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో గతములో ఎవ్వరు చేయని అభివృధి పెద్దలు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేస్తున్నారని అని అన్నారు.మా డివిజన్ లో ఇప్పటి వరకు సుమారుగా 10 మందికి పైగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు ,దానితో పాటు డబుల్ బెడ్ రూమ్ లు సైతం రావడం జరిగింది.ఎమ్మెల్యే నిత్యం నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి ఆలోచిస్తారు అని అన్నారు .

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి: అడిషనల్ కలెక్టర్ సంగీత



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, మే 18:ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోఅదిషనల్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



జగిత్యాల, మే 18 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి పట్టణ ప్రజల సౌకర్యార్థం, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 6వ వార్డులో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వార్డులోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు.సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, 7వ వార్డు కౌన్సిలర్ విజయ బాబు, 13వ వార్డు కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## రాజంపేట డివిజన్ క్యాడర్లతో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్ కుమార్ సమీక్ష సమావేశం

రాజంపేట, భారత శక్తి, మే 18 : కడప జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా డి పి ఎం యు కార్యాలయంలో రాజంపేట డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల రాజంపేట, సుండుపల్లి, నందనూరు, వీరబల్లి మండలాలు కడప జిల్లాలో చేర్చబడిన నేపథ్యంలో, ఆయా మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని అధికారికంగా జిల్లా పరిధిలోకి చేర్చుకుని వారితో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులకు అందించాల్సిన శిక్షణా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రత్యేకంగా 365 రోజుల పాటు భూమి కప్పబడి ఉండే విధంగా వివిధ పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తూ, విత్తనాలను విత్తన గుళికలుగా (సీడ్ పెల్లేటిజషన్ ) మార్చి విత్తడం ద్వారా మొలక శాతం మెరుగుపడటంతో పాటు తక్కువ నీటి పరిస్థితుల్లో కూడా పంటలు బాగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని వివరించారు.రైతులకు అవసరమైన ఘన జీవామృతం, పి ఎం డి ఎస్ సీడ్ కిట్లు, పంటలకు సంబంధించిన పురుగులు మరియు తెగుళ్ల నివారణ ద్రావణాలు బయో రిసోర్స్ సెంటర్లలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ప్రకృతి వ్యవసాయ సేవలు సమయానికి అందించడంలో సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల స్థాయి ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు స్వచ్ఛంద సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం

**- సూర్యాపేట పట్టణ సిఐ- వెంకటయ్య**



సూర్యాపేట,మే 18 (భారత శక్తి జిల్లా ప్రతినిధి ): నిత్యం ప్రజా సమస్యల పైన వార్తల సేకరణ చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదులుగా కొనసాగుతున్న వర్కింగ్ జర్నలిస్టులు స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు సైతం నిర్వహించడం అభినందనీయమని సూర్యాపేట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో గల ఫ్లైఓవర్ వద్ద తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జర్నలిస్టులు అంటే తమ వృత్తిపరంగా కావాల్సినంత బిజీగా ఉంటారు కాగా మరో అడుగు ముందుకు వేసి తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ కమిటీ వారు ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ఎండ వేడిమి బారిన పడకుండా ప్రజలకు కాస్త ఊరట కలిగించేలా సేద తీర్చే విధంగా ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాన్ని తలపెట్టిన వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరిని అదేవిధంగా కమిటీ సభ్యులందరినీ ఆయన అభినందిస్తూ ఎవరు సేవా కార్యక్రమాలు నిర్వహించిన తమ ప్రోత్సాహం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఏర్పడిన నాటి నుండి గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎన్నో ఉద్యమాలు పోరాటాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఇంత మాత్రమే కాకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలో సిఐ వెంకటయ్య చేతులమీదుగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు 300 మందికి పైగా మజ్జిగను పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరిస్తున్న తమ అసోసియేషన్ మిత్రులు అందరికీ ముఖ్యంగా ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన పట్టణ సిఐ వెంకటయ్య కు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, కోశాధికారి కొరివి సతీష్ యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు దుస్సా చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు గుంటి శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ వంశీకృష్ణ శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి తిరుపతి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా నాయకులు చెరుకు శ్రీనివాస్, సూర్యాపేట నియోజకవర్గ కమిటీ సభ్యులు యాతకుల మధుసూదన్, కుంచెం రాంబాబు, కొండ రవి, అబ్దుల్ అజీజ్, తదితర మీడియా మిత్రులు పాల్గొన్నారు

## మొక్కజొన్న బుట్టలతో కేదారేశ్వర ఆలయం ఆకట్టుకుంటోంది

**- మటేగాం సంతోష్ గౌడ్**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 18 (భారత శక్తి) భైంసా మండలం మాటేగాం గ్రామ సమీపంలో మొక్కజొన్న బుట్టలతో రూపొందించిన కేదారేశ్వర ఆలయం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆలయంలో శివలింగం, శివుని విగ్రహాలను ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటున్నారు. నిర్మల్ రహదారిపై ప్రయాణించే వారు సైతం ఆగి ఆలయాన్ని వీక్షిస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. ప్రత్యేక అలంకరణను చూసి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఏజెన్సీ సంస్థ ఈ వినూత్న ఏర్పాటును చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యాక్సెలెరాన్ ట్రీట్మెంట్ కలిగిన డికాల్బ్ 9217 విత్తనాలతో ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దృఢమైన వేరు వ్యవస్థ, పెద్ద కంకులు, ఆకర్షణీయమైన దిగుబడితో రైతులకు మంచి లాభాలు వస్తాయని తెలిపారు. సరైన సాగు విధానాలు, సమయానికి ఎరువుల వినియోగంతో ఇంకా మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచించారు.

# మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి

## - మంత్రి జూపల్లి కృష్ణారావు



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 18(భారత శక్తి)మైనారిటీల సంక్షేమం, వారి సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటి వైస్ ఛైర్మన్ మహమ్మద్ ఫహీముద్దిన్ ఖురేషి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, వసతి, పారిశుద్ధ్యం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అలాగే స్థానికంగా మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై స్పందించిన మంత్రి, సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, డీఈవో భోజన్నతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో చేనేత సహకార సంఘాల తుది ఓటర్ల జాబితా విడుదల



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే18: కామారెడ్డి జిల్లాలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అర్హులైన సభ్యులతో కూడిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేసినట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. సాగర్ తెలిపారు. సంబంధిత సహకార సంఘాలకు చెందిన సభ్యుల వివరాలు, అర్హత ప్రమాణాలను సహాయ సంచాలకుల స్థాయిలో పరిశీలించి తుది సభ్యత్వ జాబితాను అధికారికంగా ఆమోదించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, పేర్ల సవరణలు, చేర్పులను నిబంధనల ప్రకారం పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను రూపొందించినట్లు తెలిపారు. ఈ తుది జాబితాను సభ్యుల సమాచారం కోసం కామారెడ్డిలోని జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై, అలాగే సంబంధిత ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన తుది ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు త్వరలో పంపనున్నట్లు తెలిపారు. తదుపరి ఎన్నికల ప్రక్రియ మొత్తం ఈ తుది ఓటర్ల జాబితా ఆధారంగానే కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హులైన సభ్యులందరూ ఈ విషయాన్ని గమనించి తమ వివరాలను సంబంధిత కార్యాలయాల్లో పరిశీలించుకోవాలని సూచించారు.

# ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీసీ బాలికల వసతి గృహ విద్యార్థినులను అభినందించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే18: 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కామారెడ్డి బీసీ బాలికల వసతి గృహ విద్యార్థినులు జె. నాగశ్రావణి, టీనా లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ అభినందించి సన్మానించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బంజారా భవన్ లో 10వ తరగతి ఇంటర్మీడియట్ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, రూ.10,000 నగదు బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు. కామారెడ్డి జిల్లా నుండి మొత్తం 12 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ, ఇది జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 18 ( భారత శక్తి ) : ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్-ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డి సి పి భాస్కర్, గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ. సి. పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. “నో టు డ్రగ్స్ - ఎస్ టు ఎక్సర్సైజ్” నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసి తరలించిన ధాన్యం సి ఎం ఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 18 ( భారత శక్తి ) :వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యం సి.ఎం.ఆర్. ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గత ఖరీఫ్ లక్ష్యాలు పూర్తి చేసిన రైస్ మిల్లర్లు ఈసారి కేటాయించిన ధాన్యం లక్ష్యాల సాధన ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి లారీల ద్వారా తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందు కొరకు అవసరమైన హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని, ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# నరసరావుపేటలో ఎయిడ్స్ కొవ్వొత్తుల ర్యాలీ

## - ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ



**నరసరావుపేట (భారత శక్తి)** అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నరసరావుపేట పాత ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏపీఎస్ ఏ సి ఎస్, డిశా, డాప్కు సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ, స్మారక సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభించారు. హెచ్ఐవీతో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ రోజు మనం వెలిగించిన ప్రతి కొవ్వొత్తి ఎయిడ్స్‌తో పోరాడి ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకం. అదే సమయంలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మన సంఘీభావానికి గుర్తుఅని అన్నారు. భయం, వివక్ష వల్లే ఈ వ్యాధి పెరుగుతోంది. కానీ వాస్తవాలు చూస్తే భారత దేశంలో 2010 నుంచి 2024 మధ్య కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 48.7% తగ్గాయి. ఎయిడ్స్ సంబంధిత మరణాలు 81 % మేర తగ్గాయని తెలిపారు. ఏపీలో ప్రస్తుతం సుమారు 3.25 లక్షల మంది హెచ్ఐవీతో జీవిస్తున్నారు. వారిలో 2.75 లక్షల మంది ఏఆర్టి చికిత్స పొందుతున్నారు. ఎక్కువమందికి పాజిటివ్ తీవ్రత తగ్గింది, కాబట్టి పరీక్ష చేయించుకోవడానికి, చికిత్స తీసుకోవడానికి వెనుకాడవద్దని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ పాజిటివ్‌లకు గౌరవం, ప్రేమ, ఆదరణ అవసరమని అన్నారు. సమాజం నుంచి వెలివేత వద్దని ఆయన కోరారు. ఎవరైనా సహాయం కోసం 1097 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని, ఏపీఎస్ ఏ సి ఎస్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు, కౌన్సెలింగ్, ఏ ఆర్ టి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఎ సి ఎస్ అధికారులు, డి ఎ పి సి యు ప్రోగ్రామ్ మేనేజర్, వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, ఎయిడ్స్ నివారణపై నినాదాలు చేశారు.

# రెడ్ క్రాస్ సొసైటీ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే18: కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 15 నుండి జూన్ 15 వరకు నిర్వహించనున్న ప్రత్యేక రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని సభ్యత్వం పొందాలని కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో ప్రత్యేక రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా రుసుము చెల్లించి కలెక్టరేట్‌లో సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, సభ్యత్వ నమోదు ద్వారా సేవా కార్యక్రమాలకు తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెడ్ క్రాస్ డ్రైవ్ వైస్ చైర్మన్ ఎన్.వై. గిరి, కార్యక్రమ నోడల్ అధికారి డా. శశికుమార్, రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా చైర్మన్ ఎం. రాజన్న, జిల్లా రెడ్ క్రాస్ కరస్పాండెంట్ డా. పి.వి. నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 18 ( భారత శక్తి ): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పట్టణం లోని ఎం టీ ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని,నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

- మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, దిగుమతి, హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల సంబంధిత కరపత్రాలు, గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు, హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్ఫ్లుయెన్సర్/యూట్యూబర్స్తో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ లో భాగంగా గిరిజన గ్రామాలలో రహదారులు, త్రాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మాన్ నగర్ బీఈమ్యాక్ సొసైటీ ప్రజలకు

# ఇంప్రూవ్మెంట్ చార్జీలు తగ్గించండి

**జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్..**



రామచంద్రాపురం మే 18 భారత శక్తి తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో గల బిహెచ్ఇఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు..సోమవారం హైదరాబాద్లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో బిహెచ్ఎల్ పరిశ్రమలో విధులు నిర్వర్తించి.. రిటైర్మెంట్ అయిన అనంతరం బిఈమెక్ సొసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా.. మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 64 లక్షల రూపాయలు ఇంప్రూవ్మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ఇప్పటికే మూడు కోట్ల రూపాయలను డిడి రూపంలో జలమండలికి చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని.. ఇంప్రూవ్మెంట్ చార్జీలు చెల్లించే ఆర్థిక పరిస్థితులు వారికి లేవని ఆయన తెలిపారు. మానవత దృక్పథంతో ఇంప్రూవ్మెంట్ చార్జీలను రద్దుచేసి నల్ల కనెక్షన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఉమేష్, బీఈమ్యాక్ అధ్యక్షులు సంజీవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపును

# వెంటనే వెనక్కి తీసుకోవాలి

**సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గప్ప డిమాండ్**

**పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపుతో సామాన్యులపై మరింత భారం**



వికారాబాద్ మే 18 భారత శక్తి ఇంధన ధరల పెంపును వెంటనే వెనక్కి తీసుకోవాలిసీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గప్ప డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు యు. బుగ్గప్ప కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలను పెంచాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ..పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3, సీఎన్‌జీపై కిలోకు రూ.2 చొప్పున ధరలు పెంచడం వల్ల ఇప్పటికే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గిన సమయంలో కేంద్ర ప్రభుత్వం భారీగా ఆదాయం ఆర్జించిందని, అయితే ఆ ప్రయోజనాలను ప్రజలకు అందించకుండా ఇప్పుడు ధరల పెంపు ద్వారా భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆయన విమర్శించారు. అంతర్జాతీయ ధరల్లో హెచ్చుతగ్గులు వచ్చిన ప్రతిసారీ ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు.ఇంధన ధరల పెంపు ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర ప్రాథమిక సేవల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. దీంతో సామాన్య ప్రజల జీవన వ్యయం మరింత పెరుగుతుందని తెలిపారు.ప్రత్యేకంగా సీఎన్‌జీ ధరల పెంపు ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులు, ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాది మంది ప్రజలను నేరుగా ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఆలస్యంగా ప్రకటించిందని ఆరోపించారు.పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని బుగ్గప్ప డిమాండ్ చేశారు. ప్రజలపై అదనపు భారం మోపే విధానాలను ప్రభుత్వం నిలిపివేయాలని అన్నారు

## క్యాసారం బీరప్పల జాతరలో

# పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్..





పటాన్‌చెరు మే భారత శక్తి గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండల పరిధిలోని క్యాసారం గ్రామంలో సోమవారం నిర్వహించిన బీరప్పల జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, ప్రభాకర్, ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేయాలి

**ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపు.**





హైదరాబాద్ మే 18, భారత శక్తి, ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ, సమాజ ప్రగతికి యువ అధికారులు బాటలు వేయాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. సోమవారం లోక్ భవన్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంఆర్సి, హెచ్ఆర్డి)లో శిక్షణ పొందుతున్న 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అధికారులను అభినందించిన ఆయన, పరిపాలనాంశాలపై దిశానిర్దేశం చేశారు.

### బాధ్యతాయుతంగా పనిచేయడమే అసలైన పరిపాలన

ప్రొబేషనరీ అధికారులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, పదవి అనేది కేవలం అధికారం మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు.

### ప్రజా సంక్షేమమే లక్ష్యం:

ప్రతి ప్రభుత్వ నిర్ణయంలోనూ సామాన్యుడి సంక్షేమమే ప్రధాన అజెండాగా ఉండాలి.

**నిజాయితీయే బలం:** పరిపాలనలో పారదర్శకత, నిజాయితీ ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతాయి.

**సున్నితత్వం:** కార్యాలయానికి వచ్చే ప్రతి పౌరుడి సమస్యను మానవీయ కోణంలో అర్థం చేసుకుని, తగిన పరిష్కారం చూపాలి.

ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ శాంతి కుమారి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి పాల్గొన్నారు.

### సరస్వతీ అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరవ్వాలని దేవాదాయ శాఖ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించింది. మంత్రి కొండా సురేఖ, ఆలయ అర్చకులు లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### ఈఏపీసెట్ టాపర్ మల్లాడి రుషికి అభినందనలు:

తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మల్లాడి రుషిని గవర్నర్ సోమవారం లోక్ భవన్‌లో ప్రత్యేకంగా అభినందించారు. రుషి సాధించిన విజయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె పట్టుదలతో పాటు, ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా గవర్నర్ ప్రశంసించారు.

### గవర్నర్‌ను కలిసిన గిగ్ కార్మికుల సంఘం:

తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ నేతృత్వంలో పలువురు ప్రతినిధులు సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.

# పర్యాటక కేంద్రంగా ముత్తంగి ఎంక చెరువు..

**- ఏడు కోట్ల 60 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ..**

**- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. - అతి త్వరలో ప్రారంభోత్సవం..**







పటాన్‌చెరు మే 18 భారత శక్తి ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును 7 కోట్ల 60 లక్షల రూపాయలతో సుందరీకరణ చేస్తున్నామని.. అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం హెచ్ఎండిఏ అధికారులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. స్వయంగా చెరువు కట్టపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో గల ఎంక చెరువును పర్యటకంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంతో హెచ్ఎండిఎ ద్వారా 7 కోట్ల 60 లక్షల రూపాయలు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కట్ట అభివృద్ధితోపాటు బతుకమ్మ ఘాట్, లైటింగ్, వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైటింగ్, గార్డెనింగ్, తదితర పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మరో రెండు నెలల్ల పనులు పూర్తిచేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని హామీ ఇచ్చారు. ఇస్నాపూర్ ప్రజలు సైతం చెరువు కట్ట పైకి సులభంగా చేరుకునేందుకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. ముత్తంగితోపాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం గ్రామాల ప్రజలకు ఆహ్లాదకరమైన చెరువు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పటాన్చెరులోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను సైతం పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డిఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి, తదితరులు పాల్గొన్నారు.



## ఉస్మాన్ నగర్ బీఈమ్యాక్ సొసైటీ ప్రజలకు

# ఇంప్రూవ్మెంట్ చార్జీలు తగ్గించండి

**జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్..**



రామచంద్రాపురం మే 18 భారత శక్తి తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో గల బిహెచ్ఇఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ జలమండలి ఎండి అశోక్ రెడ్డిని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు..సోమవారం హైదరాబాద్లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్ లో బిహెచ్ఎల్ పరిశ్రమలో విధులు నిర్వర్తించి.. రిటైర్మెంట్ అయిన అనంతరం బిఈమెక్ సొసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా.. మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 64 లక్షల రూపాయలు ఇంప్రూవ్మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ఇప్పటికే మూడు కోట్ల రూపాయలను డిడి రూపంలో జలమండలికి చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని.. ఇంప్రూవ్మెంట్ చార్జీలు చెల్లించే ఆర్థిక పరిస్థితులు వారికి లేవని ఆయన తెలిపారు. మానవత దృక్పథంతో ఇంప్రూవ్మెంట్ చార్జీలను రద్దుచేసి నల్ల కనెక్షన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి అతి త్వరలో వీటికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రజా ప్రతినిధులు ఉమేష్, బీఈమ్యాక్ అధ్యక్షులు సంజీవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవాలయాల అభివృద్ధికి వంగ రాజేశ్వర్ రెడ్డి చేయూత

**- రెండు ఆలయాలకు రూ.1 లక్ష విరాళం**





సిద్దిపేట, మే 18 (భారత శక్తి): గ్రామ దేవాలయాల అభివృద్ధికి వంగ రాజేశ్వర్ రెడ్డి చేయూతనందిస్తూ బీరప్ప కామరతి--చౌడలమ్మ, పెద్దమ్మ--పెద్దిరాజుల ఆలయాలకు విడివిడిగా రూ.50 వేల చొప్పున మొత్తం రూ.1 లక్ష విరాళం అందజేశారు.సిద్దిపేట రూరల్ మండలం ఏన్సాన్పల్లి గ్రామంలో నిర్వహించిన బీరప్ప కామరతి--చౌడలమ్మ కళ్యాణ మహోత్సవం, అలాగే నంగునూరు మండలం నర్మెట గ్రామంలో జరిగిన పెద్దమ్మ--పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, యాదవ కురుమ సంఘ నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు, మహిళలు, యువతతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్లో యువకుడు అనుమానాస్పద మృతి

**రంగారెడ్డి(భారత శక్తి)** మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామ శివారులోని వ్యాస ఫామ్ హౌస్లో జరిగిన బర్త్డే పార్టీలో తన స్నేహితులతో పాల్గొన్న యువకుడు, స్విమ్మింగ్ పూల్లో అనుమానాస్పద స్థితిలో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన వాచ్ మెన్ స్నేహితులకు సమాచారం ఇచచాడు. పోలీసులు యువకుడి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అధికారులు సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మృతుడు హైదరాబాద్ మజీద్ బండకు చెందిన యాక్సిస్ బ్యాంక్ సెకూరిటీ గార్డ్ సాయి(28)గా గుర్తించారు.

## భార్యపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్

**కృష్ణాజిల్లా (భారత శక్తి)** ఉయ్యూరులో భార్యపై రాయితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను ఉయ్యూరు పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఉయ్యూరుకు చెందిన బొర్రా పుష్ప (35), బొర్రా సాంబయ్య (36) దంపతులు. వీరికి సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరికీ ఇది రెండో వివాహం కాగా, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా కొంతకాలంగా వీరు విడిగా నివాసం ఉంటున్నారు.గతంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు సాంబయ్యపై కేసు నమోదు కాగా, ఆ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణలో ఉంది.

ఈ నేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకున్న సాంబయ్య, ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో ఉయ్యూరు కాటూరు రోడ్డులోని అమరావతి గ్రాండ్ హోటల్ ఎదురుగా పుష్పను అడ్డగించి, రాయితో ముఖం, తలపై దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది.సమాచారం అందుకున్న ఉయ్యూరు పట్టణ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని బాధితురాలిని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో నిందితుడు బొర్రా సాంబయ్యను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా సీఐ టి.వి.వి. రామారావు మాట్లాడుతూ.. ఘటన సమయంలో నిందితుడి చేతిలో ప్రమాదకరమైన ఆయుధం లేకపోయినా, అక్కడ ఉన్నవారు బాధితురాలిని రక్షించేందుకు ముందుకు రాకుండా వీడియోలు, ఫోటోలు తీయడం బాధాకరమన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు వెంటనే స్పందించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు బాధితులను రక్షించే ప్రయత్నం చేయాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరిలో మానవత్వం, బాధ్యతాయుత వైఖరి ఉండాలని కోరారు.

## నదుల అనుసంధానానికి ఆద్యుడు కె.ఎల్.రావ్

**- పట్టిసీమ 5ఏళ్ళలోనే 50వేల కోట్ల సంపద సృష్టించింది.**

**- కె.ఎల్. రావ్ వర్ధంతి వేడుకల్లో మంత్రి నిమ్మల రామానాయుడు.**

**(భారత శక్తి)** భారతదేశ చరిత్రను మార్చిన హీరాకుడ్, భాక్రానంగల్, శ్రీశైలం, నాగార్జున సాగర్ వంటి బహుళార్ధక సాధక ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు అని కొనియాడారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. సోమవారం అమరావతి సచివాలయంలో పద్మభూషణ్ డాక్టర్. కె.ఎల్ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్. కె.ఎల్ రావు సేవలు అందరికీ స్ఫూర్తి దాయకం, ఆదర్శనీయం అని అన్నారు.ఈ రోజు అందరం మాట్లాడుకుంటున్న నదుల అనుసంధానం గురించి, దేశంలో మొదటి సారిగా ప్రతిపాదించిన వ్యక్తి కె.ఎల్.రావు అని అన్నారు.

అందుకే ఆయన మనకు ఒక స్ఫూర్తి అని మంత్రి నిమ్మల తెలిపారు. దేశంలో కరువు కాటకాలు పోవాలంటే నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని, గంగా, మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి, వంటి నదుల అనుసంధానంతోనే సాధ్యమౌతుందని ప్రగాఢంగా నమ్మిని వ్యక్తి కె.ఎల్ రావు అని అన్నారు.కె.ఎల్ రావు స్ఫూర్తిని నాడు వాజ్‌పేయ్, నేడు ప్రధాని మోధీ అందిపుచ్చుకున్నారని, ముఖ్యంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పట్టి సీమ నిర్మాణం ద్వారా గోదావరి నుండి కృష్ణాకు గోదావరి జలాలను తరలించి నదుల అనుసంధాన కార్యక్రమానికి భీజం వేశారని తెలిపారు. నాడు 1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 5ఏళ్ళలోనే 50వేల కోట్ల ఆదాయం సృష్టించిందని స్పష్టం చేశారు. భవిష్యత్ లో కూడా కె.ఎల్ రావు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేలా, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షం చేసేలా చంద్రబాబు పని చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, జలవనరుల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీలు నరసింహమూర్తి, వరప్రసాద్, సిఈలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫామ్ హౌస్ మర్డర్ కేసు సంచలనం

**"ఆ రోజు వెళ్లి ఉంటే మేమూ బతికి ఉండేవాళ్లం కాదు" - కరీమా బీ బాధిత మహిళల ఆవేదన**

**వృద్ధ మహిళల హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్**





వికారాబాద్ మే 18 భారత శక్తి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఇద్దరు అదృశ్యమైన వృద్ధ మహిళల హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వాలనిఅడిగినందుకు ఇద్దరు వృద్ధ మహిళలను మొయినాబాద్ సమీపంలోని ఫామ్ హౌస్ పక్కన ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యంత దారుణంగా హత్య చేసి పూడ్చిపెట్టిన ఘటనపై బాధిత మహిళలు సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రధాన నిందితురాలు కరీమా బీ గతంలో తమను కూడా ఫామ్ హౌస్‌కు రావాలని పలుమార్లు పిలిచిందని, అయితే ఆ సమయంలో తమకు ఇతర పనులు ఉండటంతో వెళ్లలేకపోయామని అప్పు ఇచ్చిన సదరు మహిళలు తెలిపారు. అదే తమ ప్రాణాలను కాపాడిందని వారు భావోద్వేగానికి గురయ్యారు. "ఆ రోజు వెళ్లి ఉంటే నేడు మేమూ బతికి ఉండేవాళ్లం కాదు" అంటూ మీడియా పలువురు మహిళలు ముందు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ నెల 12వ తేదీన పోలీసులు కరీమా బీతో పాటు మిగతా నిందితులను అదుపులోకి తీసుకోవడంతో తాము ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చిన అమాయక వృద్ధ మహిళలను అత్యంత కిరాతకంగా హత్య చేసి, అనంతరం పాతిపెట్టడం మానవత్వానికే మచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తల్లి సమానులైన వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసిన కరీమా బీతో పాటు ఈ ఘటనలో పాల్గొన్న మిగతా నిందితులందరికీ కఠిన శిక్ష విధించాలని బాధితులు పోలీసులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కేసును పోలీసులు వేగంగా ఛేదించడం పై స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తామని తాండూర్ రూరల్ సీఐ ప్రభాకర్ రెడ్డి అన్నారు

# కొడంగల్‌లో రైతు కన్నీరు...

## సీఎం సొంత నియోజకవర్గంలోనే ధాన్యం దుస్థితి చూడండి

**- ప్రభుత్వం పై సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు**

**- వరి కొనుగోలు కేంద్రాల వద్ద బీఆర్ఎస్ నాయకుల నిరసన**







వికారాబాద్ మే 18 భారత శక్తి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో వరి కొనుగోలు కేంద్రాల పరిస్థితిపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ విధానాల పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు.సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని తుంకిమెట్ల, దౌల్తాబాద్ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వరి కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ , మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, శుభ ప్రద్ పటేల్ తో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద మహిళా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...

"45 రోజులుగా ధాన్యం కొనుగోలు జరగడం లేదు. వర్షాలకు తడిసి ధాన్యానికి మొలకలు వస్తున్నాయి. రైతులు కన్నీరు పెట్టుకునే పరిస్థితి నెలకొంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే వరి కొనుగోలు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని విమర్శించారు. "సీఎం సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే... మిగతా జిల్లా లో పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి" అని పేర్కొన్నారు. రైతులు తమతో మాట్లాడుతూనే తడిసిన ధాన్యాన్ని చూపిస్తూ బాధ వ్యక్తం చేశారని తెలిపారు. అనంతరం కొడంగల్ కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ప్రభుత్వంపై మరిన్ని ఆరోపణలు చేశారు. రైతులకు అవసరమైన యూరియా సరైన సమయంలో అందడం లేదని, గన్ని బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని అన్నారు. పంట దిగుబడులు భారీగా వచ్చినా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. "రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే వేచి చూస్తున్నారని. పంట అమ్ముకోలేక కొందరు రైతులు కల్లాల వద్దే ప్రాణాలు కోల్పోతున్న దుస్థితి కనిపిస్తోంది" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న కొనుగోలు వ్యవస్థపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఎంత మేర సాగు జరిగింది, ఎంత దిగుబడి వచ్చే అవకాశం ఉందనే స్పష్టమైన లెక్కలు కూడా ప్రభుత్వానికి లేవని ఆరోపించారు. దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

"మేము వెళ్లి మాట్లాడితేనే కొనుగోళ్లు ప్రారంభమవుతున్నాయనీ, రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతిరోజూ ఒక ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోంది" అని వ్యాఖ్యానించారు. రైతులకు అండగా బీఆర్ఎస్ నిలబడితేనే ప్రభుత్వం స్పందిస్తోందని అన్నారు. కొడంగల్ రైతులు సీఎం క్యాంప్ కార్యాలయం ముందు నిరసనకు వెళ్లాలని పిలుపునిచ్చిన సబితా ఇంద్రారెడ్డి... వెంటనే యూరియా అందుబాటులో ఉంచి, వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యువజన క్రీడా వారోత్సవాలకు శ్రీకారం...

## సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 5 కేఎం మారథాన్ ప్రారంభించిన మల్‌రెడ్డి రాంరెడ్డి



ఎల్బీనగర్, మే 18 (భారత శక్తి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన క్రీడా వారోత్సవాలు జరుపుతున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా, సోమవారం రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నుండి కొత్తపేట్ వరకు నిర్వహించిన 5కేయం మారథాన్ ను జెండా ఊపి ప్రారంభించిన రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కొప్పిషెట్టి కిరణ్మయి ఐఏఎస్, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారిణి (డివైఎస్ఓ) శ్రీమతి ఎస్.స్వర్ణలత, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.రాష్ట్ర యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో యువతలో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, క్రీడా స్ఫూర్తి, సామాజిక బాధ్యతాభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం యువతకు ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, నాయకత్వ వికాసం వంటి రంగాలలో విస్తృత అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. యువత దేశ భవిష్యత్తు అని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికీ దోహదపడతాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "ఫిట్ ఇ యాక్టివ్ తెలంగాణ" లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా మారథాన్‌లు, వాక్‌థాన్‌లు, యోగా, జుంబా, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా కెరీర్ ఇ స్కిల్ డెవలప్‌మెంట్, యూత్ లీడర్‌షిప్ సమ్మిట్స్, స్పోర్ట్స్ డే, క్లీన్ తెలంగాణ కార్యక్రమాలు, ఉద్యోగ సాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏయంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, యువజన ప్రతినిధులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్యం ఫిట్నెస్‌పై అవగాహన కల్పించేందుకు 2కే రన్:

### - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల (భారత శక్తి)** ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23 వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2 కె రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్..అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. చైల్డ్ సేఫ్టీ వీక్ కింద మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి,డీవైఎస్‌ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోటి 15 లక్షలతో కరాలపాడు గ్రామాభివృద్ధికి శ్రీకారం

### - కరాలపాడు టీడీపీ నాయకుడు షేక్ జానీ వెల్లడి




**పిడుగురాళ్ల (భారత శక్తి)** పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల మండలం లోని కరాలపాడు గ్రామ అభివృద్ధికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కరాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ జానీ విలేకరులతో మాట్లాడుతూ, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, కూటమి ప్రభుత్వ పాలనలో గురజాల నియోజకవర్గం సరికొత్త ప్రగతి పథం వైపు అడుగులు వేస్తోంది అని జానీ అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి యే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని షేక్ జానీ అన్నారు. ఇందులో భాగంగానే కరాలపాడు గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందనీజలో ఉంచేందుకు రూ. కోటి 15 లక్షల భారీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రోడ్ల నిర్మాణం, డ్రైనేజ్ మరియు ఇతర ప్రజా ఉపయోగకర పనులను వేగవంతం చేసి పూర్తి చేశారు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని స్థానిక నాయకులు, ప్రజలు అహర్షం వ్యక్తం చేస్తున్నారు. గురజాల ప్రగతి ప్రస్థానం యరపతినేని ఆధ్వర్యంలో ఇలాగే నిరంతరాయంగా కొనసాగుతుందని షేక్ జానీ ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు



**సిద్దిపేట (భారత శక్తి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం నిర్వహనకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఏర్పాట్లపై ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రజలను ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం పెంచేందుకు ఉద్దేశించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ఇప్పటికే గ్రామ మండల మరియు నియోజకవర్గ స్థాయి సమావేశాలను పూర్తి చేయడం జరిగిందని ఈనెల 22న జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించాలని ఈ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు తదితర ఏర్పాటు చేయాలని సమావేశం ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల సంబంధించి స్టాళ్లను ఏర్పాటు చేయాలని అదేవిధంగా ప్రజలకు వివరించేందుకు శాఖల వారీగా ఇందిరమ్మ ఇండ్లు,మాహాలక్ష్మి,గృహ జ్యోతి,రైతు బీమా,రైతు భరోసా,కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న రకం వడ్లకు ప్రోత్సాహకం,ఆసరా పింఛన్లు తదితర పథకాల వివరాలను సిద్ధం చేయాలని, లబ్ధిదారులతో మాట్లాడించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాక్‌టౌన్ కాలనీ సమస్యల పరిష్కారానికి ఈటెల రాజేందర్ హామీ.

### - నిధుల మంజూరుకు సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి

శామీర్‌పేట, మే 18: భారత శక్తి,మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యుడు ఈటెల రాజేందర్‌ను రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం శామీర్‌పేటలోని ఆయన నివాస కార్యాలయంలో కలుసుకున్నారు. కాలనీలో సుదీర్ఘకాలంగా వేధిస్తున్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

**సీసీ కెమెరాలు, తాగునీటి ట్యాంకే ప్రధాన సమస్యలు:**

కాలనీలో రక్షణ వ్యవస్థను మెరుగుపరచడానికి నిఘా కెమెరాల (సీసీ కెమెరాలు) ఏర్పాటుతో పాటు, స్థానికులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఒక ఓవర్ హెడ్ జలశయం (తాగునీటి ట్యాంక్) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. బడ్జెట్ త్వరితగతిన విడుదల చేయించి, పనులను వేగవంతం చేయాలని వారు కోరారు.

**సానుకూల స్పందన.. త్వరలోనే నిధులు:**






కాలనీ ప్రతినిధుల విజ్ఞప్తిపై ఎంపీ ఈటెల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందే ఉంటుందని స్పష్టం చేశారు. వినతిపత్రంలో పేర్కొన్న రెండు ప్రధాన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, ఇందుకు సంబంధించిన నిధుల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు.**

ఈ కార్యక్రమంలో రాక్‌టౌన్ సొసైటీ ప్రతినిధులు ఎర్ర వినోద్ రెడ్డి, జైపాల్ రెడ్డి, మణిపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, సంజీవ రెడ్డి, సంపత్ కుమార్, సులోచన, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవా అంతర్జాతీయ సదస్సులో "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు

### - 2026" అందుకున్న తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



సిద్దిపేట, మే 19(భారత శక్తి ):సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. గోవాలో మే 16వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించిన ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫరెన్స్ -- 2026 కార్యక్రమంలో ఆయనకు "హ్యూమన్ రైట్స్ డిఫెండర్ అవార్డు -- 2026" ప్రదానం చేశారు.దేశవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ అంతర్జాతీయ సదస్సు విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. సమాజంలో అణగారిన వర్గాల పక్షాన నిలబడి సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రీ రాగసందేశ్, నేషనల్ ప్రెసిడెంట్ శ్రీ కొంగర అనిల్ కుమార్ చేతుల మీదుగా గుర్రాల శ్రీనివాస్ అవార్డును స్వీకరించారు. సభలో ఈ ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న నాయకులకు ఇలాంటి అంతర్జాతీయ స్థాయి గుర్తింపులు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గుర్రాల శ్రీనివాస్ గత అనేక సంవత్సరాలుగా దళితులు, బడుగు బలహీన వర్గాలు, అణగారిన సమాజాల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తున్నారు. సామాజిక అన్యాయం, వివక్ష, హక్కుల ఉల్లంఘనలపై ఆయన చేస్తున్న పోరాటం అనేక మంది బాధితులకు న్యాయం అందించే దిశగా కీలక పాత్ర పోషిస్తోందని సభలో పలువురు కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజ్యాంగ చైతన్యం, సామాజిక అవగాహన పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని అభిప్రాయపడ్డారు.సమాజ సేవలో ఆయన చేస్తున్న విశిష్ట కృషికి గుర్తింపుగా ఇప్పటికే "దళిత రత్న అవార్డు"తో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు (దీూూ) కూడా ఆయన అందుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న



కృషిని సదస్సులో పాల్గొన్న పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా ప్రశంసించారు. సదస్సులో జరిగిన చర్చల్లో మానవ హక్కుల పరిరక్షణ అనేది కేవలం బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని వక్తలు పేర్కొన్నారు. బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే నాయకులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మరింత చైతన్యం పెరుగుతుందనిఅభిప్రాయపడ్డారు.అవార్డు స్వీకరించిన అనంతరం గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ,"ఈ గౌరవం నా ఒక్కరికి సంబంధించినది కాదు. సమాజంలో న్యాయం కోసం, హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి సామాన్యుడికి చెందిన గౌరవం ఇది. భవిష్యత్తులో కూడా రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం మరింత కట్టుబాటుతో పనిచేస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు గుర్రాల శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ

### - అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి స్పష్టమైన ఆదేశాలు - రంగారెడ్డి జిల్లాలో చురుగ్గా సాగుతున్న కొనుగోళ్లు

రంగారెడ్డి, మే 18: భారత శక్తి, జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మేనేజర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా సహకార అధికారి మరియు రైస్ మిల్లర్లతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, చెల్లింపులు, మిల్లుల వద్ద ఎదురవుతున్న సవాళ్లపై సుదీర్ఘంగా చర్చించారు.

**లక్ష్యం 40 వేల మెట్రిక్ టన్నులు..**

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చంద్రారెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగానే పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

**ప్రస్తుత పురోగతి:** జిల్లాలో ఇప్పటివరకు 37 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీపీసీ) కేంద్రాలను ప్రారంభించాం.

**కొనుగోళ్లు:** వీటి ద్వారా ఇప్పటివరకు 7,187 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగింది.



**చెల్లింపులు:** ధాన్యం విక్రయించిన రైతులకు సంబంధించి ఇప్పటికే రూ.6 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేశాం. నిధులను కూడా త్వరలోనే విడుదల చేస్తాం.

**క్షేత్రస్థాయిలో పర్యటించాలి..**

ధాన్య సేకరణలో ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు.

**తరుగు తీస్తే కఠిన చర్యలు: మిల్లర్లకు హెచ్చరిక:**

రైస్ మిల్లర్లు తమ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యాన్ని వెంటనే దించుకోవాలని చంద్రారెడ్డి సూచించారు. "ధాన్యంలో ఎలాంటి నాణ్యత కోతలు (తరుగు) విధించకుండా రైతుల నుంచి సరుకును స్వీకరించాలి. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే లారీలు, ట్రాక్టర్లు మిల్లుల వద్ద ఒక రోజు కంటే ఎక్కువ సమయం వేచి ఉండకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే మిల్లులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయి." అని ఆయన హెచ్చరించారు.

రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# వైసీపీ గ్రాఫ్ పెరిగిందా... తగ్గిందా

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తోంది. వచ్చే నెల 12 నాటికి రెండేళ్లు పూర్తికానుంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైన ఈ రెండు సంవత్సరాల్లో.. ఆ పార్టీకి గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా? అంటే సరైన సమాధానం దొరకని పరిస్థితి. అయితే ఒక్క మాట మాత్రం చెప్పగలం. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు ను ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేక పోతున్నారు.. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడులతో పాటు అభివృద్ధి పనులను చేసి ప్రజల దృష్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లకుండా చూస్తోంది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుణ పాఠాలు నేర్చుకోలేదు. ప్రజలను ఒప్పించే ప్రయత్నం చేయలేదు. వారితో మమేకం కాలేకపోతోంది కూడా.అమరావతి రాజధాని అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నీడలా వెంటాడుతూనే ఉంది. ప్రధానంగా జగన్మోహన్ రెడ్డి తాజాగా ప్రతిపాదన చేసిన మావిగన్ పై ప్రజల్లో ప్రతికూలత తెచ్చింది. ఆయన మాటలను ప్రజలు చాలా తేలిగ్గా తీసుకున్నారు. అదేదో కొత్త ప్రతిపాదన కంటే అమరావతిపై విషం చిమ్మడమే అనేది మెజారిటీ ప్రజల అభిప్రాయం. గతసారి టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు అమరావతిలో గ్రాఫిక్స్ చేశారు అంటూ జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలను ప్రజలు నమ్మారు. ఇప్పుడు కూడా అమరావతిపై పదే పదే ఆ తరహా ప్రచారం చేయడానికి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. మొన్నటి ఎన్నికల్లో అమరావతి రాజధాని అనేది ఒక అజెండాగా తీసుకున్నారు ప్రజలు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అయినా పదేపదే దాని జోలికి వెళ్లి ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరు కాకపోవడం సైతం ఆ పార్టీకి మైనస్. కేవలం ప్రతిపక్ష హోదా ఇస్తేనే ప్రజల గురించి సభకు వచ్చి మాట్లాడతానని జగన్ చెప్పడాన్ని ఎవరు హర్షించడం లేదు. పైగా ప్రజల మధ్యకు జగన్మోహన్ రెడ్డి వచ్చింది చాలా తక్కువ. ప్రస్తుతం ఆయన తన సొంత పార్టీ నేతల అరెస్టు సమయంలోను.. వారి ఇళ్లల్లో పరామర్శలకు.. వివాహాలకు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనల సమయంలో సైతం ఆయన హాజరుకావడం లేదు. అదికూడా ఆ పార్టీ గ్రాఫ్ తగ్గించింది. పైగా స్థానికంగా కూడా ఉండడం లేదు. ఇతర రాష్ట్రంలో నాలుగు రోజులు పాటు ఉంటే.. తాడేపల్లి లో మూడు రోజులు గడుపుతున్నారు. వీకెండ్ సర్వీసులు బెంగళూరు నుంచి ఉండడంతో ప్రజలు పెద్దగా నమ్మడం లేదు జగన్మోహన్ రెడ్డిని. అన్నింటికీ మించి వైఫల్యాలను అధిగమించడం లేదు ఆ పార్టీ.టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తెస్తోంది.

దీనిని ఆహ్వానించడం లేదు జగన్మోహన్ రెడ్డి. విశాఖకు ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. అనుబంధా ఐటీ పరిశ్రమలు వచ్చాయి. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. అమరావతిలో అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. వీటికి ఆహ్వానించక పోగా.. భూ సమీకరణ, భూ సేకరణ పేరుతో అడ్డు తగులుతున్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. ఇలాంటి కారణాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోతుంది తప్ప.. ఎంత మాత్రం పెరగడం లేదన్నది విశ్లేషకుల మాట. చూడాలి ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందో..

# చిన్న నేతలపై జ'గన్' ఎలివేషన్ ఇస్తున్న మాజీ సీఎం

**కర్నూలు,(భారత శక్తి)** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం కోసం తహతహలాడుతోంది. 2029 ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. అందుకోసం ఏ చిన్న అవకాశాన్ని కూడా జారవిడుచుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీలో చేరికలను ప్రోత్సహించి.. బలోపేతం చేయాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్రణాళిక. అందులో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో మోపిదేవి శ్రీనివాసరావు అనే నేతను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. పేరులో మోపిదేవి ఉండడంతో.. ఒకప్పటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణకు సమీప బంధువు అని అంతా భావించారు. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేశారని.. ఆయనకు అక్షరాల 2800 ఓట్లు వచ్చాయని.. నోటాకు కంటే కాస్త ఎక్కువ ఓట్లు అని ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేరికల విషయంలో ఇప్పుడు భిన్న ప్రచారం నడుస్తోంది. ఆ పార్టీలో చేరేందుకు హేమా హేమీలు ముందుకు వచ్చేవారు. అటువంటిది ఓ రెండు వేల ఓట్లు వచ్చిన నాయకుడిని చేర్చుకోవడంలో జగన్మోహన్ రెడ్డి చూపించిన శ్రద్ధ ఇప్పుడు హైలెట్ అవుతోంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ నుంచి సాకే శైలజానాథ్ చేరిన తర్వాత.. పెద్ద పెద్ద తలకాయలు వస్తాయని అంతా భావించారు. కానీ ఇప్పుడు చిన్న నాయకులను సైతం చేర్చుకునేందుకు జగన్మోహన్ రెడ్డి అంత ఆసక్తి చూపిస్తుండడం మాత్రం విశేషం. జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడు రాజశేఖర్ రెడ్డి సన్నిహితులకు కనీస స్థానం లేదు ఆ పార్టీలో. ఇప్పుడు వారిని రమ్మంటూ పార్టీ నుంచి ఆహ్వానాలు అందుతున్నాయి. కానీ చిన్న నాయకులను సైతం పార్టీలో చేర్చుకునే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అతి ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు జగన్ మోహన్ రెడ్డి. ఎంతోమంది నేతలకు అవకాశాలు కల్పించారు. 151 మందికి ఎమ్మెల్యేలుగా ఛాన్స్ ఇచ్చారు. ఓ 40 మంది వరకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఓ 40 మంది వరకు ఎంపీలుగా అవకాశం ఇచ్చారు. ఓ 50 మంది వరకు మంత్రులుగా ఛాన్స్ కల్పించారు. వందలాది మందికి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. అటువంటి జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఓ చిన్న నేతను పార్టీలో చేర్చుకునే క్రమంలో ఇస్తున్న ప్రాధాన్యం అంతా ఇంత కాదు. ఒకప్పుడు ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు కలిసేందుకు కూడా అపాయింట్మెంట్ లభించేది కాదు. అటువంటిది ఇప్పుడు ఒక చిన్న నాయకుడు కూడా పెద్ద నేతగా పరిగణిస్తుండడం మాత్రం గొప్ప విషయం..

కర్నూలులో సైతం కర్నూలు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యాక్టివ్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఇటీవల కర్నూలు నగరంలో పర్యటించారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. మంత్రిగా ఉన్న టీజీ భరత్ పైనే ఆరోపణలు చేశారు. అనేక రకాల విమర్శలు చేశారు.

అదే స్థాయిలో టిడిపి నుంచి ఆయనపై కౌంటర్ అటాక్ ప్రారంభం అయింది. ఏదైనా వివాదం సృష్టించాలి అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రంగంలోకి దిగుతారు అనేది టిడిపి నేతలు వాదన. జగన్మోహన్ రెడ్డి వాడుకుంటున్న మనిషిగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై ఒక విమర్శ ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు టిడిపి నేతలు. ఆయన కంటే వెనుక రాజకీయాల్లోకి వచ్చిన ఆయన సోదరి, అంటే పెదనాన్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె శబరి ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. కానీ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాత్రం చట్టసభలకు ఇంతవరకు ఎన్నిక కాలేకపోయారు.కర్నూలు జిల్లాలో బైరెడ్డి కుటుంబానికి ప్రత్యేక రాజకీయ ప్రస్థానం ఉంది. ఆ ఫ్యామిలీ ఆది నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చింది. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తండ్రి కూడా ఎమ్మెల్యేగా వ్యవహరించారు. మంత్రి పదవి చేపట్టారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సైతం టిడిపి ద్వారా ఎన్నో పదవులు పొందారు. చట్టసభలకు ఎన్నికయ్యారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తమ్ముడు కుమారుడే సిద్ధార్థ రెడ్డి. ఆయనపై పలుమార్లు కేసులు నమోదయ్యాయి. ఫ్యాక్షన్ తరహాలో కామెంట్స్ చేస్తుంటారు. తనకు జైలు జీవితం కొత్త కాదు అన్నట్టు మాట్లాడుతుంటారు. తెలుగుదేశం పార్టీలో కొనసాగిన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ సమయంలోనే సిద్ధార్థ రెడ్డి సైతం వైసీపీలో చేరారు. అయితే రాజశేఖర్ రెడ్డి తిరిగి బిజెపిలోకి వచ్చి అక్కడి నుంచి.. టిడిపిలో చేరిపోయారు. ప్రస్తుతం ఆయన కుమార్తె ఎంపీగా ఉన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారు. పిట్ట కథలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతుంటారు.

అయితే చట్టసభలకు ఇంతవరకు ఛాన్స్ ఇవ్వలేదు జగన్మోహన్ రెడ్డి. పక్క జిల్లాల్లో సైతం చాలామంది నేతలకు అవకాశం కల్పించింది జగన్మోహన్ రెడ్డి. అటువంటిది ఉద్దేశపూర్వకంగానే బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని జగన్మోహన్ రెడ్డి పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సొంత నియోజకవర్గం నందికొట్కూరు ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది. మరి అటువంటిప్పుడు సిద్ధార్థ రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వచ్చు కదా. లేకుంటే వేరే అసెంబ్లీ నియోజకవర్గం కేటాయించవచ్చు కదా? అనే ప్రశ్న వినిపిస్తూ ఉంటుంది. 2014లో ఛాన్స్ దక్కలేదు. 2019లో అవకాశం ఇవ్వలేదు. 2024లో పరిగణలోకి తీసుకోలేదు. అయితే సిద్ధార్థ రెడ్డి మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం గట్టిగానే తపన పడుతున్నారు. ఎక్కడైనా వివాదాస్పద అంశాలను హైలెట్ చేయాలనుకుంటే జగన్మోహన్ రెడ్డి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని ప్రయోగిస్తారన్న టాక్ ఉంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# 89 శాతం పచ్చదనంతో శేషాచలం అడవులు

## – దేశంలోనే రికార్డ్...



**తిరుపతి (భారత శక్తి):** 89.40 శాతం పచ్చదనంతో తిరుమల గిరులు కళకళలాడుతున్నాయి. అరణ్య సంపద పరిరక్షణలో టీటీడీ అటవీ శాఖ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. స్థానిక వృక్ష సంపద పునరుద్ధరణకు విస్తృత చర్యలు తీసుకుంటున్నారు. 576 హెక్టార్లలో స్వదేశీ మొక్కల పెంపకం చేపట్టారు. ప్రత్యేక నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరా చేస్తున్నారు. ఏనుగులు, చిరుతలు సహా వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆలయ పూజ కైంకర్యాలలో అటవీ శాఖ పాత్ర కీలకంగా మారిందితిరుమల గిరులు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.. ఏకంగా 89.40 శాతం పచ్చదనం కనిపిస్తోంది. 1980 నుంచి టీటీడీ అటవీ శాఖ శేషాచల అరణ్య సంపదను పరిరక్షిస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుతోంది. కోట్లాది మంది భక్తుల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తోంది. తూర్పు కనుమల్లో విస్తరించిన పవిత్ర శేషాచల పర్వత శ్రేణుల్లోని అరణ్య ప్రాంతాలను సంరక్షిస్తూ జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకంగా మారింది. టీటీడీ అటవీ విభాగ పరిధిలో మొత్తం 2719 హెక్టార్ల విస్తీర్ణంలో అరణ్య ప్రాంతం ఉంటే.. తాజా ఐఎస్ఎఫ్ఆర్ (ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక) ప్రకారం 89.40 శాతం మేర అటవీ ప్రాంతం నమోదైంది. దేశంలోనే అత్యుత్తమైన స్థానంలో నిలిచింది. దాదాపు 2431 హెక్టార్లలో అటవీ ప్రాంతాలు ఉండగా.. వాతావరణ నియంత్రణ, జీవ వైవిధ్య సంరక్షణకు దోహదపడుతున్నాయి.డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆధ్వర్యంలో టీటీడీ అటవీ విభాగం కొనసాగుతోంది. మొత్తం నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లు తిరుమలలో రెండు, తిరుపతిలో రెండు చొప్పున ఉన్నాయి. ఇలా ప్రతి రేంజ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంటుంది. అటవీ పరిరక్షణను ఫీల్డ్ స్థాయిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో చేపడుతున్నారు. 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పహారా ఉంటూ అటవీ సంపద సంరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరు అక్రమ చెట్ల నరికివేత, వేట చర్యలను అరికడుతున్నారు. అటవీ అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక ఫైర్ లైన్లతో పాటుగా శిక్షణ పొందిన బృందాలు అగ్నిమాపక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి ఏంటా 26.5 లక్షల చదరపు మీటర్ల మేర ఫైర్ లైన్లు నిర్వహిస్తున్నారు.టీటీడీ జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా విదేశీ జాతికి చెందిన అకేషియా చెట్ల స్థానంలో స్థానిక వృక్ష సంపదను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం 576 హెక్టార్లలో స్థానిక జాతులైన గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు, రావి, మర్రి, జువ్వి, మేడి, సంపంగి, మామిడి వంటి మొక్కలను దశలవారీగా నాటుతున్నారు. ఇప్పటివరకు 22 హెక్టార్లలో పనులు పూర్తయ్యాయి. అంతేకాదు టీటీడీ పరిధిలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లలో ప్రత్యేక నర్సరీలను నిర్వహిస్తున్నారు. అక్కడ స్థానిక జాతుల మొక్కలు, అలంకార మొక్కలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఈ నర్సరీల ద్వారా అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలకు అవసరమైన నాణ్యమైన మొక్కలను సరఫరా చేస్తున్నారు.శేషాచల అటవీ ప్రాంతంలో ఎన్నో వన్యప్రాణులు నివసిస్తున్నాయి. మానవ ? వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు, గాయపడిన జంతువులను రక్షించేందుకు టీటీడీ అటవీ విభాగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంతాల్లో జంతువుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక నీటి గుంతలు ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపుతున్నారు. తిరుమలలో దర్శన క్యూ లైన్ ప్రాంగణాల్లో మూడు స్నేక్ రెస్క్యూ బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంటారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరమైన చెట్లను గుర్తించి తొలగించడం, గాలివానల కారణంగా పడిపోయిన చెట్లను తొలగించడం, రహదారుల పక్కన చెట్ల కొమ్మలను క్రమం తప్పకుండా తొలగిస్తున్నారరు.తిరుమల, టీటీడీ ఆలయ అవసరాల కోసం అవసరమైన శ్రీగంధం చెక్కలు, వంట చెరుకు, దర్భ గడ్డి, ఇతర పూజా సామగ్రిని టీటీడీ ఫారెస్ట్ విభాగం సమకూరుస్తోంది. తిరుమల, తిరుపతిలోని రహదారి డివైడర్లు, ఉద్యానవనాలు, పచ్చదన అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది.

మొత్తం 24 కిలోమీటర్ల మేర రహదారి డివైడర్లు, 25 ఉద్యానవనాలను సంరక్షిస్తోంది. వీటితో పాటుగా అరుదైన, ఔషధ గుణాలు ఉన్న వృక్ష జాతుల పరిరక్షణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు.ఆయుర్వేద ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను కూడా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం పవిత్ర వనం, దివ్య ఔషధ వనం, పలమనేరు టింబర్ ప్లాంటేషన్, వన్యప్రాణి ఘర్షణల నివారణకు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యం.. కొండల పచ్చదనం పెంపు వంటి పలు కీలక ప్రాజెక్టులను టీటీడీ ఫారెస్ట్ విభాగం అమలు చేస్తోంది.

# ఏపీ నుంచి రాజ్యసభకు అన్నామలై?

**విజయవాడ,(భారత శక్తి)** తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై ఇప్పుడు పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే నెలలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని బీజేపీకి కేటాయించాలని కూటమి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ స్థానంలో ఎవరిని పంపాలనే విషయంపై బీజేపీ హైకమాండ్ సుదీర్ఘంగా చర్చించి, చివరకు అన్నామలై పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం.అన్నామలైను ఏపీ నుంచి రాజ్యసభకు పంపడం వెనుక బీజేపీ పెద్ద వ్యూహమే పన్నింది. తమిళనాడులో బీజేపీ ఎదలేకపోతోంది. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని పని చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు అక్కడ సనాతన ధర్మ వివాదం ఉంది. ఈ కోణంలో విజయ్ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఢీకొట్టాలంటే అన్నామలైకు జాతీయ స్థాయి హోదా ఉండాలని బీజేపీ భావిస్తోంది. ఎంపీగా ఆయనకు దక్కే హోదా, తమిళనాడులో ఆయన గళాన్ని మరింత బలోపేతం చేస్తుందని, తద్వారా హిందూత్వ ముద్రతో బీజేపీని బలోపేతం చేయాలని అనుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ , సానా సతీష్‌ల పదవీ కాలం త్వరలో ముగియనుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న అఖండ మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవంగా కూటమి ఖాతాలో పడటం ఖాయం. ఇందులో రెండు స్థానాలను టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి బీజేపీ పంచుకునే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ తన కోటా స్థానాన్ని అన్నామలైకు కేటాయించాలని చంద్రబాబు నాయుడుతో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.తమిళనాడులో అన్నామలై కేంద్ర మంత్రి కాబోతున్నారన్న ప్రచారంజరుగుతోంది. అన్నాడీఎంకేతో పొత్తు కోసం ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడంతో ..ఆయనకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్లమెంటుకు పంపడం ద్వారా ఆయన స్థాయిని పెంచాలని బీజేపీ యోచిస్తోంది. గతంలోనే విజయసాయిరెడ్డి రాజీనామా సమయంలోనే అన్నామలై పేరు వినిపించినా, అప్పట్లో ఏపీ నేతకే అవకాశం దక్కింది. కానీ ఈ సారి మాత్రం అన్నామలై రాజ్యసభ ఎంట్రీ ఖాయమని తమిళ పొలిటికల్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.తమిళనాడులో అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు కొనసాగుతోంది. అయితే మెజార్టీ ఎమ్మెల్యేలు టీవీకేతో చేరిపోయారు. అన్నామలై రాజ్యసభ ఎంపీగా ఉంటే కూటమిలో ఆయన పాత్ర మరింత కీలకం కానుంది. అటు డీఎంకే, ఇటు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీలను ఎదుర్కోవడానికి అన్నామలై వంటి దూకుడున్న నేత అవసరమని బీజేపీ హైకమాండ్ గట్టిగా నమ్ముతోంది. ఏపీ నుంచి ఆయన పెద్దల సభకు వెళ్తే, అటు ఏపీ అభివృద్ధికి, ఇటు తమిళనాడు రాజకీయ బలోపేతానికి వారధిగా నిలుస్తారని భావిస్తున్నారు.

# కొడాలి, వల్లభనేనిలకు క్లాస్

**విజయవాడ, (భారత శక్తి)** ఏపీలో అత్యంత హాట్ నియోజకవర్గాలు గుడివాడ, గన్నవరం. కృష్ణాజిల్లాలోని ఈ రెండు నియోజకవర్గాలు ఎప్పుడు హాట్ టాపిక్ గా నిలిచేవి. ఎందుకంటే ఇక్కడ ఎమ్మెల్యేలుగా ఉండే కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ తరచు వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. ముఖ్యంగా రాజకీయ అవకాశం కల్పించిన తెలుగుదేశం పార్టీతో పాటు చంద్రబాబుపై విరుచుకుపడేవారు. ఆయన కుమారుడు లోకేష్ పై సైతం వ్యక్తిగత కామెంట్లు చేసేవారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఈ ఇద్దరు నేతలు ఒక వెలుగు వెలిగారు. ఇందులో కొడాలి నాని మంత్రిగా కూడా వ్యవహరించారు. అటు వంశీ మోహన్ ఎమ్మెల్యే గా ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో ఆ ఇద్దరూ ఓడిపోయారు. ముందుగా అనారోగ్యానికి గురయ్యారు. ఇంకొకరు జైలుకు వెళ్లి అనారోగ్యం పాలయ్యారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరూ నియోజకవర్గాలకు దూరంగా ఉన్నారు. దీంతో వైసిపి కార్యకలాపాలు నిలిచిపోయాయి. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పిలిచి మాట్లాడినట్లు తెలుస్తోంది.మొన్ననే రేపల్లెలో మోపిదేవి శ్రీనివాసరావు అనే కాంగ్రెస్ నాయకుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మొన్నటి ఎన్నికల్లో నోటా తో సమానంగా ఓట్లు వచ్చాయి. అయినా సరే అవసరం ఉంది కాబట్టి జగన్మోహన్ రెడ్డి మోపిదేవి శ్రీనివాసరావును పిలిచి పార్టీ కండువా కప్పారు. స్థానిక వైసీపీ ఇన్చార్జ్ మోహన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని.. ఆయన గెలుపు బాధ్యతలు తీసుకుంటే.. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవి ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు గుడివాడ తో పాటు గన్నవరంలో అదే ఫార్ములా తో అడుగులు వేస్తున్నారట జగన్. అందుకే ఆ ఇద్దరు నేతలను పిలిచి చర్చించారట. వారి అభిప్రాయాన్ని సేకరించారట.గుడివాడలో ఇవే తనకు చివరి ఎన్నికలు అని కొడాలి నాని మొన్న ప్రకటించారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. గత రెండు సంవత్సరాలుగా గుడివాడలో పార్టీ యాక్టివిటీస్ తగ్గాయి. అదే సమయంలో టిడిపి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దూసుకుపోతున్నారు. గన్నవరం లో కూడా అదే పరిస్థితి. అక్కడి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో బలమైన నేతగా ఎదిగారు. అందుకే ఆ రెండు నియోజకవర్గాల్లో టిడిపి పట్టు బిగించడంతో జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. గుడివాడలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ ఎన్నారై జగన్మోహన్ రెడ్డికి టచ్ లోకి వచ్చినట్లు తెలుస్తోంది.

ఇంకోవైపు గన్నవరం నియోజకవర్గానికి చెందిన మహిళ నేత సుంకర పద్మశ్రీ సైతం వైసీపీలోకి వచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఆమె కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఉన్నారు. పిసిసి అధ్యక్ష పదవి ఆశించారు. షర్మిల రూపంలో ఆమెకు ఛాన్స్ మిస్సయింది. అందుకే ఆమె వైసీపీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఇద్దరు నేతలను పిలిచి పార్టీలోకి కొత్తవారు వస్తున్నారని.. ఉంటే మీరు రంగంలో ఉండండి.. లేకుంటే వారికి ఛాన్స్ ఇస్తానంటూ జగన్మోహన్ రెడ్డి కుండ బద్దలు కొట్టినట్లు సమాచారం.

# ఒకే నెలలో రెండు సార్లు పెంపు

**ఒంగోలు (భారత శక్తి)** ప్రతి రోజూ ఉదయాన్నే కప్పు కాఫీ లేదా టీతో రోజును మొదలుపెట్టే సగటు భారతీయుడికి చేదు వార్త. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతుండగా, ఇప్పుడు ఆ సెగ పాల వరకు పాకింది. దేశీయ పాల ఉత్పత్తుల దిగ్గజాలు అమూల్ , మదర్ డైరీ మరోసారి వినియోగదారులపై ధరల భారాన్ని మోపాయి. లీటర్ పాలపై ఏకంగా రూ. 2 మేర పెంచుతున్నట్లు ప్రకటించి సామాన్యుడి బడ్జెట్‌ను అతలాకుతలం చేశాయి. ఈ కొత్త ధరలు **మే 14 నుంచి అమల్లోకి రావడం గమనార్హం.**నిజానికి అమూల్ సంస్థ ఈ నెల 1వ తేదీనే పాల ధరలను పెంచింది. ఆ దెబ్బ నుంచి జనం ఇంకా కోలుకోకముందే, కేవలం రెండు వారాల వ్యవధిలోనే మళ్ళీ ధరలు పెంచడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. పశు గ్రాసం ధరలు పెరగడం, ప్యాకేజింగ్ మెటీరియల్ ఖర్చులు భారం కావడం, వీటన్నింటికీ తోడు అంతర్జాతీయంగా నెలకొన్న ఇంధన సంక్షోభం వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని కంపెనీలు చెబుతున్నాయి. మరోవైపు రైతులకు చెల్లించే పాల సేకరణ ధరలను కూడా పెంచామని, ఆ భారాన్ని సర్దుబాటు చేసేందుకే వినియోగదారులపై ఈ వడ్డన తప్పలేదని అమూల్ తెలిపింది.

**మారిన ధరల ఇవే** అత్యధికంగా అమ్ముడయ్యే ఫుల్ క్రీమ్, టోన్డ్ పాల ధరలు ఇప్పుడు రూ. 70 మార్కును దాటేశాయి.అమూల్ కొత్త రేట్లు:

అమూల్ గోల్డ్ (ఫుల్ క్రీమ్): రూ. 68 నుంచి రూ. 70కి చేరింది.
అమూల్ తాజా (టోన్డ్): రూ. 55 నుంచి రూ. 57కి పెరిగింది.
అమూల్ ఆవు పాలు: లీటరు రూ. 60.
అమూల్ గేదె పాలు: లీటరు రూ. 78.

మదర్ డైరీ కొత్త రేట్లు:

ఫుల్ క్రీమ్ పాలు: రూ. 70 నుంచి రూ. 72కి పెరిగింది.
టోన్డ్ పాలు: రూ. 58 నుంచి రూ. 60కి చేరింది.
ఆవు పాలు: లీటరు రూ. 62.
టోకెన్ పాలు: లీటరు రూ. 58.

# బుద్ధ వెంకన్న అల్లుడిపై పోలీసులకు పిర్యాదు

**విజయవాడ (భారత శక్తి)** విజయవాడ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న అల్లుడు కాండ్రేగుల రవి పై వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు నమయోదయింది. బాధితులు గడ్డం సుమన్,గడ్డం రేణుక దేవి మాట్ఆడుతూ బుద్ధా వెంకన్న అల్లుడు కాండ్రేగుల రవి వల్ల నాకు నా భర్త, పిల్లలకు ప్రాణ హాని ఉంది. నమ్మకంగా వ్యాపారంలో భాగస్వామి గా ఉండి మోసం చేసి బినామీలతో తన భార్య చెక్స్ తీసుకొని చెక్ బౌన్స్ కేసులు వేసి బెదిరిస్తున్నాడు అని పిర్యాదు లో పేర్కొన్నారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే భార్య నీ పిల్లలను చంపేస్తా అని బెదిరిస్తున్నాడు అని పిర్యాదు చేసారు. కాండ్రేగుల రవి వల్ల కోట్లలలో నష్ట పోయాం. ఇది మా రాజ్యం మేము చెప్పేదే జరుగుతుంది అని బెదిరిస్తున్నారు. మేము ఎదైనా చేస్తాం మా వెనుక మా మామ బుద్ధ వెంకన్న ఉన్నాడు అంటూ బెదిరిస్తున్నాడని అన్నారు.ఇప్పుడు మేము కంప్లైంట్ ఇచ్చాము అని తెలిస్తే మా మీద దాడి చేస్తారు. మా కుటుంబానికి ఎం జరిగిన పూర్తి బాధ్యత వాళ్లదే. ఎటువంటి ప్రమేయం లేని తన భార్యన్ని కొంతమంది బినామీలతో చెక్ బౌన్స్ కేసులు పెట్టి వేదిస్తునారు అని పిర్యాదు చేసారు. గతంలో కాల్ మనీ కేసుల్లో కీలక సూత్ర దారిగా బుద్ధ వెంకన్న అల్లుడు రవి ఉన్నాడని అన్నారు.

## అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది..



తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్.'ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

## రష్మిక టాటూ వెనుక
# ఆసక్తికర ఘటన!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటనతోనే, తన వ్యక్తిగత విషయాలతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె కుడిచేతి మణికట్టుపై ఉన్న 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ గురించి సోషల్ మీడియాలో నిరంతరం రకరకాల పుకార్లు షికారు చేస్తూనే ఉన్నాయి. ఈ టాటూను ఆమె హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ నెటిజన్లు రకరకాల కథనాలను ప్రచారం చేస్తున్నారు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక, ఈ టాటూ వెనుక ఉన్న అసలైన నిజాన్ని, దానికి దారితీసిన ఆసక్తికరమైన నేపథ్యాన్ని బయటపెట్టి ఆ పుకార్లకు పూర్తిగా చెక్ పెట్టారు. నిజానికి తనకు మొదట్లో శరీరంపై ఎలాంటి టాటూ వేయించుకోవాలనే ఆలోచనే లేదని రష్మిక స్పష్టం చేశారు. కానీ ఆమె కాలేజీ చదువుతున్న రోజుల్లో జరిగిన ఒక చిన్న సంఘటన ఆమె మనసును బలంగా తాకింది. ఒకరోజు కాలేజీలో ఒక అబ్బాయి రష్మిక దగ్గరకు వచ్చి, ఆడపిల్లలు అస్సలు నొప్పిని భరించలేరని... వారికి సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయమని కాస్త ఎగతాళిగా మాట్లాడాడు. ఆ మాటలను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక... ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా ఓర్చుకోగలరని నిరూపించడానికి, ఆ అబ్బాయి గర్వాన్ని అణచడానికే ఎలాగైనా టాటూ వేయించుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నారట. తీరా టాటూ వేయించుకోవాలని ఫిక్స్ అయిన తర్వాత, చేతిపై ఎలాంటి పదాన్ని రాయించుకోవాలా? అని చాలా సమయం ఆలోచించానని రష్మిక వెల్లడించింది. తన జీవితంలో ఎప్పుడూ చాలా సహజంగా, రియల్‌గా ఉండాలని కోరుకునే రష్మికకు ఒక బలమైన ఆలోచన వచ్చింది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిని మరొకరు ఎప్పటికీ భర్తీ చేయలేరని, ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో ప్రత్యేకమైనవారని ఆమె బలంగా నమ్ముతారు. ఆ విషయాన్ని ప్రతిరోజూ తనకు తాను గుర్తుచేసుకోవడానికి, అలాగే తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఒక మంచి లక్ష్యంగా ఉంచుకోవడానికి 'ఇర్రీప్లేసబుల్' అనే పదాన్ని టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక క్లారిటీ ఇచ్చారు.

## 'ది రెడ్ బ్యాగ్' చిత్రంలో
# సావిత్రి పాత్రను పోషించిన రాశీ



మెమరీ మేకర్స్ బ్యానర్ మీద డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు.ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ సినిమా నుంచి స్పెషల్ రోల్ పోషిస్తున్న రాశీ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు.సావిత్రి పాత్రలో రాశీ 'ది రెడ్ బ్యాగ్' సినిమాలో ఓ పవర్ ఫుల్ రోల్‌ను పోషించారు. ఇక ఈ పాత్రకు సంబంధించిన గెటప్, లుక్స్ ఎంత సింపుల్‌గా ఉన్నాయో.. ఆమె లుక్ అంత ఇంటెన్స్‌గా ఉంది. ఈ చిత్రాన్ని మలుపు తిప్పే ఓ కీలక పాత్రలో రాశీ నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది. తొలి సినిమానే అయినా, నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి శేఖర్ మోపూరి సంగీతమందించగా.. ప్రియేష్ గురుసామి కెమెరామెన్‌గా, శివ శర్వాని ఎడిటర్‌గా పని చేశారు.

నటీనటులు : కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు

## సెయాన్‌మూవీ
# షూటింగ్ ప్రారంభం



వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్'' ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న 'అమరన్' తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ చేస్తున్న చిత్రమిది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది.ఈ రోజు నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ఇంటెన్స్ పోస్టర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. పోస్టర్‌లో శివకార్తికేయన్ రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న ఆగ్రహం క్యారెక్టర్ పవర్ ని చూపిస్తున్నాయి. ఈ పోస్టర్ సినిమా ఆధ్యాత్మికతతో పాటు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను కూడా కలిగి ఉంటుందనే సంకేతాలు ఇస్తోంది.ఈ చిత్రాన్ని భారీ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్, మాస్ అప్పీల్, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే ఎంటర్టైనర్ గా సినిమా రూపొందనుంది.ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. వివేక్ విజయకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తుండగా, షాన్ లోకేష్ ఎడిటింగ్ చేస్తున్నారు. యాక్షన్ డైరెక్టర్‌గా సుప్రీమ్ సుందర్ పని చేస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అరుణ్ వెంకటరామూడి రూపొందిస్తున్నారు.ఇతర నటీనటుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. తారాగణం: శివకార్తికేయన్

## శ్రీలీల, తిలక్ వర్మ
# డేటింగ్ రూమర్స్.
### – ఫుల్ క్లారిటీ ఇచ్చిన హీరోయిన్ తల్లి



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల, టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె తల్లి స్వర్ణలత తెరదించారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె ఖరాఖండిగా తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కథనాల్లో అణువంత కూడా నిజం లేదని, ఇలాంటి పుకార్లు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఈ అంశంపై పూర్తి స్పష్టతనిస్తూ స్వర్ణలత మాట్లాడుతూ.. "ప్రస్తుతం శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు చదువులపైనా పూర్తి దృష్టి పెట్టింది. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యపై ఏకాగ్రత చూపుతోంది. ముఖ్యంగా నీట్–పీజీ పరీక్ష కోసం సన్నద్ధమవుతోంది. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించే దశకు ఇంకా చాలా సమయం ఉంది. బహుశా మరో ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాతే ఆ విషయాలపై దృష్టి పెడుతుంది" అని వివరించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంఘటనల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. 2025 డిసెంబర్‌లో తిరుమలలో శ్రీలీల, తిలక్ వర్మ కలిసి కనిపించడం, వాంఖడే స్టేడియంలో జరిగిన ఓ టీ20 మ్యాచ్‌కు శ్రీలీల హాజరుకావడం వంటివి కేవలం యాదృచ్ఛిక సంఘటనలేనని తెలిపారు. వాటి ఆధారంగా ఊహాగానాలు సృష్టించి సంబంధాన్ని అంటగట్టడం సరికాదని ఆమె హితవు పలికారు.గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి ప్రచారమే జరిగిందని స్వర్ణలత గుర్తుచేశారు.

బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ.. "కార్తిక్ ఆర్యన్ తల్లి, నేను ఇద్దరం గైనకాలజిస్టులం. మా మధ్య ఉన్న వృత్తిపరమైన పరిచయాన్ని తప్పుగా అర్థం చేసుకుని అప్పట్లో ఇలాంటి కథనాలే సృష్టించారు" అని ఆమె పేర్కొన్నారు. సినీ తారల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండానే కథనాలు ప్రచారం చేయడం తగదని, అభిమానులు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ఆమె సూచించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy